RNI : TGMUL/25/A1386

# తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చైర్మన్& చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 03 సంచిక - 282 పేజీలు - 08 ఆదివారం 06 సెప్టెంబర్ 2026

## తొలి పలుకు

అతి తక్కువ కాలంలో అన్ని వర్గాల్లో విశేష ఆదరణ పొందుతున్న తొలి అక్షరం దినపత్రిక నిష్పక్షపాత విశ్వసనీత సమాచారంతో డిజిటల్ రంగంలో అగ్రస్థానంలోకి అడుగుపెడుతున్న తరుణంలో పాఠక మహాశయుల ఆదరాభిమానం మన్నల్ని పొందుతూ దూసుకుపోతున్న తొలి అక్షరం తెలుగు దినపత్రిక సూర్యోదయంతో పాటే పాఠకుల ముందుకు వస్తూ రాష్ట్రస్థాయిలో దేశస్థాయిలో ప్రపంచ స్థాయిలోని సమాజంలోని అన్ని రంగాల్లోని సంబంధిత అంశాలపై సమాచార వ్యాప్తిలో ముందుంటుంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ముందు ఉంచడంలో తొలి అక్షరం దినపత్రిక అనేక మంది పాఠకుల ఆధార అభిమానాలు పొందుతుండడం విశేషంగా భావిస్తూ.. ఇదేవిధంగా పాఠకులు ఆదరాభిమానాలు ఇలాగే కొనసాగాలని ఆశిస్తూ....

- పి.సైదులు ఎడిటర్ తొలి అక్షరం దినపత్రిక



# 4 రాష్ట్రాల్లో జనగణన

## - ఈ డిసెంబర్ 1 నుంచే షురూ!

తొలి అక్షరం/న్యూఢిల్లీ,సెప్టెంబర్ 05: కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. వచ్చే ఏడాది ఉత్తరాఖండ్, పంజాబ్, ఉత్తర్‌ప్రదేశ్, గోవాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉండగా, ఈ రాష్ట్రాల్లో జనగణన ప్రక్రియను కాస్త ముందుగానే నిర్వహించాలని నిర్ణయించింది. దీనికి సంబంధించి తాజాగా షెడ్యూల్ విడుదల చేసింది. ఈ ఏడాది డిసెంబర్ 1న మిగతా2లో...

## ఉక్రెయిన్‌పై దాడులకు విరామం..
# పుతిన్ కీలక ఆదేశం



తొలి అక్షరం/మాస్కో సెప్టెంబర్ 05:రష్యా–ఉక్రెయిన్ మ ధ్య సుదీర్ఘ కాలంగా కొనసాగుతున్న యుద్ధంలో శనివారం నాడు కీలక పరిణామం చోటుచేసుకుంది. ఉక్రెయిన్‌పై మూడు రోజుల పాటు దాడులను నిలిపివేయాలని రష్యా సైన్యాన్ని మిగతా2లో...

# సీట్లు పెరిగితే
# 117 గెలుస్తాం

## - ఇప్పుడున్నవే అయితే 90 గెలుస్తాం

● కాస్కోండి కల్వకుంట్ల కుటుంబమా? ● సిరిసిల్లపై కాంగ్రెస్ జెండా ఎగరవేస్తా ● సిద్దిపేటలోనూ కాంగ్రెస్ దే గెలుపు ● వెయ్యి రోజుల్లో కేసీఆర్‌కు రూ.22 కోట్లు ఖర్చు ● ప్రభుత్వ సొమ్ము తీసుకొని అసెంబ్లీకి రావట్లేదు ● ప్రజా సమస్యలు కేసీఆర్ ప్రస్తావించరా? ● ఏడాదిలో 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం ● నకిరేకల్ బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి ● వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రి ప్రారంభం



తొలి అక్షరం/హైదరాబాద్,సెప్టెంబర్ 05: ఏ విషయంపైనైనా చర్చించేందుకు తాను సిద్ధమన్న సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీకి రావాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు సవాల్ విసిరారు. నల్గొండ జిల్లా నకిరేకల్‌లో వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రిని ప్రారంభించిన అనంతరం, స్థానిక రాజీవ్ గాంధీ మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ఏడాదిపాటు రాకపోతే తొలగిస్తామని, వెయ్యి రోజుల్లో కేసీఆర్‌కు రూ.22 కోట్లు ఖర్చయ్యిందని, ప్రభుత్వ సొమ్ము తీసుకొని మిగతా2లో...

## 'చెత్త సేకరణ'ను రాంకీకి
# అప్పగించొద్దు



● ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి ● లేదంటే సీఎం ఇంటి ముందే 1000 ఆటోల చెత్త పోస్తాం : కల్వకుంట్ల కవిత

తొలి అక్షరం/హైదరాబాద్,సెప్టెంబర్ 05: చెత్త సేకరణ కాంట్రాక్టును రాంకీ సంస్థకు అప్పగించే యోచనను విరమించుకోవాలని టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. లేకుంటే వెయ్యి స్వచ్ఛ ఆటోల చెత్తను సీఎం ఇంటి ముందు పోస్తామని ఆమె మిగతా2లో...

# మూడు తరాల్ని
# ముంచేశారు

దగ్గర్లోనే కాంగ్రెస్‌ను నిషేధిత జాబితాలో పెట్టే రోజులు

పాలిటెక్నిక్ భూములపై ప్రభుత్వం కన్ను..జీవో 97ను అసెంబ్లీలో

ఎండగడతాం : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్







## కాంగ్రెస్ ప్రభుత్వం భూదందా సాగిస్తోంది

2ఏతో ప్రజల భూములను లాక్కునే కుట్ర

కేసీఆర్ ప్రభుత్వం బాటలో రేవంత్ కూడా..

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు



# 264 ఎకరాల్లో
# భారీ ప్రాజెక్ట్...

తొలి అక్షరం/హైదరాబాద్,సెప్టెంబర్ 05: హైదరాబాద్‌లో భారీ ఏఐ డేటా సెంటర్ ఏర్పాటుకు టీసీఎస్ అనుబంధ సంస్థ హైపర్‌వాల్ట్ ఏకంగా రూ.70,000 కోట్ల వరకు పెట్టుబడి పెట్టనుంది. ఈ ప్రాజెక్ట్‌తో వేలాది మందికి ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉండటంతో పాటు, హైదరాబాద్‌కు గ్లోబల్ ఏఐ రంగంలో మరింత కీలక స్థానం దక్కనుంది. పీటీఐ కథనం ప్రకారం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) అనుబంధ సంస్థ హైపర్‌వాల్ట్ హైదరాబాద్‌లో 264 ఎకరాల భూమిని దక్కించుకున్నట్లు శనివారం ప్రకటించింది. ఇక్కడ భారీ స్థాయిలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) డేటా సెంటర్ క్యాంపస్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ ప్రాజెక్ట్ కోసం హైపర్‌వాల్ట్, దాని భాగస్వాములు కలిసి రూ.70,000 కోట్ల వరకు పెట్టుబడి పెట్టనున్నారు.ఈ డేటా సెంటర్ సామర్థ్యం మిగతా2లో...

దేశంలోనే అతిపెద్ద ఏఐ డేటా సెంటర్

హైదరాబాద్‌లో టీసీఎస్ రూ.70వేల కోట్ల పెట్టుబడి

గ్రీన్ ఎనర్జీ, వాటర్-న్యూట్రల్ డిజైన్‌తో క్యాంపస్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కీలక సమావేశం

దేశానికే ఇది చారిత్రాత్మక ప్రాజెక్టు: సిఎం రేవంత్




# ఈనెల 7 నుంచి అసెంబ్లీ సమావేశాలు

- అధికారులకు కీలక సూచనలు చేసిన స్పీకర్, చైర్మన్

# సీట్లు పెరిగితే 117 గెలుస్తాం

(మొదటి పేజీ తరువాయి)

అసెంబ్లీకి రావట్లేదని అన్నారు. ప్రజల సొమ్ము తిని ప్రజా సమస్యలు ప్రస్తావించరా? అని నిలదీశారు. బీఆర్ఎస్ అనే మొక్కను తెలంగాణలో మొలకెత్తనివ్వమని, సిరిసిల్ల, సిద్దిపేటలోనూ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుస్తోందని ఆశాభావం వ్యక్తం చేశారు. 'ఈ నెలఖరుకు వస్తా, సిరిసిల్లపై కాంగ్రెస్ జెండా ఎగరవేస్తా, వచ్చే నెలలో సిద్దిపేటకు వస్తా, కాస్కోండి కల్వకుంట్ల కుటుంబమా?, సీట్లు పెరిగితే 117 సీట్లు గెలుస్తాం, ఇప్పుడున్న సీట్లే ఉంటే 90 సీట్లు గెలుస్తాం' అని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజాపాలన పోవాలి పాపాల భైరవుడు రావాలి అని వాళ్లు కోరుకుంటున్నారని, తమ ప్రభుత్వం వచ్చిన ఏడాదిలో 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని తెలిపారు. మీ జిల్లాకు ఒకేసారి మూడు ఎమ్మెల్సీ పదవులను ఇచ్చామని, కేసీఆర్ సీఎం అయితే వాళ్ల కుటుంబసభ్యులకు పదవులు ఇచ్చారని, తమ ప్రభుత్వంలో ఉద్యమకారుల పిల్లలకు పదవులు ఇచ్చామని గుర్తు చేశారు. అందరిలాగానే బీఆర్ఎస్ కార్యకర్తలకూ రేషన్‌కార్డులు, సన్నబియ్యం ఇస్తున్నామని గుర్తు చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తల ఇళ్లలో ఉచిత కరెంట్ వస్తోందంటే మా ప్రభుత్వం కృషి కాదా అని సీఎం ప్రశ్నించారు. మేం ఇచ్చిన రైతుభరోసా నిధులను ఎవరైనా బీఆర్ఎస్ కార్యకర్తలు వద్దన్నారా అని అడిగారు. సంపాదన పోయిందని బావ, బామ్మర్ది ఏడుస్తున్నారని ఎద్దేవా చేశారు. నాకు చదువు లేదని బీఆర్ఎస్ నేతలు అంటున్నారు. చదువు లేకపోయినా నాకు సంస్కారం ఉంది. నాకు సంస్కారం ఉంది కాబట్టే మీరు రోడ్లపై తిరుగుతున్నారు. నాకు సంస్కారం ఉంది కాబట్టే కొండా సురేఖ, సీతక్కతో రాఖీ కట్టించుకున్నా. ఎక్కడ ఆస్తి ఇవ్వాల్సి వస్తుందోనని మీరు చెల్లిని బయటకు గెంటేశారు. చెల్లిని బయటకు గెంటేసిన వ్యక్తి ఆడబిడ్డల గురించి ఆలోచిస్తారా?. నాలుగు ఇంగ్లీష్ ముక్కలు వస్తే సరిపోదు. ఆడబిడ్డను చూసుకోవాలి. నీ సంస్కారం ఏంటో నా సంస్కారం ఏంటో అసెంబ్లీకి రా చూసుకుందాం. నేను మంచిగా ఉంటే మీరు ఏదో అనుకుంటున్నారు. బందిపోట్లలా తెలంగాణను దోచుకున్నారు. వచ్చే ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ప్రభుత్వమే వస్తుందన్న రేవంత్ రెడ్డి నకిరేకల్ గడ్డా కాంగ్రెస్ అడ్డా అని వేముల వీరేశం నిరూపించారని తెలిపారు. నకిరేకల్ నియోజకవర్గ అభివృద్ధికి అండగా ఉండాలని వీరేశం కోరారని అన్నారు. గత ప్రభుత్వం అమలుచేసిన ఏ పథకాన్ని అయినా రద్దు చేశామా అని అడిగారు. మీరు ఇచ్చిన పథకాలను మరింత మెరుగ్గా ఇస్తున్నామని, బీఆర్ఎస్ ప్రభుత్వం వల్ల రైతులు అనేక రకాలుగా మోసపోయారని, చివరి విడత రైతుభరోసా నిధులు వేయకుండానే గద్దె దిగిపోయారని పేర్కొన్నారు. మీరు ఎగవేసిన రైతుభరోసా రూ.36 వేల కోట్లను రైతుల ఖాతాల్లో వేశామని, రాష్ట్రాన్ని అన్ని రకాలుగా ముంచి గద్దె దిగిపోయారని, వడ్ల కొనుగోలు, రైతుభరోసా, వడ్లకు బోనస్, ఉచిత కరెంట్ ఇస్తున్నామని వెల్లడించారు. మీకు ధైర్యం ఉంటే అసెంబ్లీకి రండి. అన్నీ చర్చిద్దాం. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కోసం రూ.11 వేల కోట్లు ఇచ్చాం. ఇవాళ కోటి మంది మహిళలు బస్సుల్లో ప్రయాణం చేస్తున్నారు. మహిళలకు ఉచిత బస్సు ఇవ్వడం చూసి కొందరు తట్టుకోలేకపోతున్నారు. మహిళలకు ఉచిత బస్సు రద్దు చేయాలంటూ ఆటో డ్రైవర్లను రెచ్చగొడుతున్నారు. సమస్యలు ఏంటో చెప్పాలని ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్నారు. వీలైన ప్రతిచోటా మహిళలను ప్రోత్సహిస్తున్నాం. కేసీఆర్ ఎప్పుడైనా మహిళల బాగు గురించి ఆలోచించారా?. మహిళలకు పెట్రోల్ బంకులు, సోలార్ నిర్వహణ అప్పగించాం. నిరుద్యోగ యువత ఉసురు పోసుకుని ఇవాళ ఫామ్‌హౌస్‌కే పరిమితం అయ్యారు. పిల్లి శాపాలకు ఉట్లు తెగవని కేసీఆర్ గుర్తుపెట్టుకోవాలి. నల్గొండ జిల్లా నకిరేకల్‌లో రూ.32 కోట్లతో నిర్మించిన 100 పడకల ఆస్పత్రిని ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి ఆస్పత్రి మొత్తం తిరిగి పరిశీలించారు. ఆస్పత్రిలో అందించబోయే సేవలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. నకిరేకల్‌లో పలు అభివృద్ధి పనులకు సీఎం శ్రీకారం చుట్టారు. రూ.345 కోట్లతో 12 రకాల అభివృద్ధి పనులకు సీఎం శ్రీకారం చుట్టారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, సమీకృత మండల కార్యాలయాల సముదాయ నిర్మాణాలకు సీఎం శంకుస్థాపన చేశారు.

# మూడు తరాల్ని ముంచేశారు

**తొలి అక్షరం/హైదరాబాద్,సెప్టెంబర్ 05:** 'కాంగ్రెస్ పార్టీనే నిషేధిత జాబితాలో పెట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి.. ఒక్క మంత్రినే బర్తరఫ్ చేయడం కాదు.. ఆ ప్రభుత్వాన్నే బర్తరఫ్ చేసే రోజులొచ్చాయి' అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్ర సర్కారుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభు త్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయిన సందర్భంగా, యువతకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడాన్ని నిరసిస్తూ.. కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో శనివారం నిర్వహించిన 'యువ సమరభేరి' సభలో ఆయన ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీ యూత్ డిక్లరేషన్‌లో 24 హామీలు ఇచ్చి 100 రోజుల్లో అమలు చేస్తామని డైలాగులు కొట్టి వెయ్యి రోజులు దాటినా ఒక్క హామీనీ నెరవేర్చలేదన్నారు. బకాసురుల్లా మేస్తూ, కుంభకర్ణుల్లా పడుకుంటూ, పందికొక్కుల్లా తింటూ పాలనను గాలికి వదిలేశారన్నారు. 'ఇన్ని రోజులుగా యువతను మోసం చేసిన ధోకేబాజ్ రేవంత్ రెడ్డి వెంటనే రాజీనామా చేయాలి. పేదల భూములను నిషేధిత జాబితాలో పెడుతున్న కాంగ్రెస్‌ను రాబోయే రోజుల్లో ప్రజలే నిషేధిత జాబితాలో పెట్టడం ఖాయం' అని అన్నారు. **పాలిటెక్నిక్ భూములపై కాంగ్రెస్ కన్ను..**సిరిసిల్ల, వేములవాడ (అగ్రహారం) పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులను కలిసి కేటీఆర్ మాట్లాడారు. జీవో 97ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ 20 రోజులుగా ఆందోళన చేస్తున్న విద్యార్థులకు బీఆర్ఎస్ పూర్తిగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పాలిటెక్నిక్ కళాశాలలను లేబర్ డిపార్ట్‌మెంట్ పరిధిలోకి తెస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీవో నంబర్ 97 వెనుక పెద్ద కుట్ర ఉందన్నారు. హైదరాబాద్‌లోని మాసబ్‌ట్యాంక్, సిరిసిల్ల, కరీంనగర్‌లోని విలువైన పాలిటెక్నిక్ భూములు, ఆస్తులను ఇతర అవసరాలకు మళ్లించేందుకే ప్రభుత్వం ఈ ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. జీవో 97ను రద్దు చేసే వరకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని స్పష్టం చేశారు. విద్యార్థులపై కేసులు పెట్టి భయపెట్టాలని చూస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. ఈ పర్యటనలో కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య తదితర నాయకులు పాల్గొన్నారు. **అలుగునూరులో తృటిలో తప్పిన ప్రమాదం** కేటీఆర్‌కు కరీంనగర్ శివారులోని అలుగునూరు చౌరస్తా వద్ద మానకొండూరు మాజీ ఎమ్మెల్యే రసమయి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. భారీ క్రేన్‌తో గజమాల వేసి సన్మానించాయి. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన మహిళలు కేటీఆర్‌కు పోటీపడి చేతినిండా రాఖీలు కట్టారు. కేటీఆర్ కారు వెనుక డోర్ తెరిచి కార్యకర్తలకు అభివాదం చేస్తున్న సమయంలో పక్క నుంచి వెళ్తున్న ఓ లారీ ఢీకొట్టడంతో కారు డోర్ స్వల్పంగా దెబ్బతిన్నది.

# 264 ఎకరాల్లో భారీ ప్రాజెక్ట్...

(మొదటి పేజీ తరువాయి)

గరిష్ఠంగా 1 గిగావాట్ (జీడబ్ల్యూ) వరకు ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా ఏఐ కంపెనీలు, హైపర్‌స్కేలర్లు ఉపయోగించుకునేలా దీన్ని ప్రత్యేకంగా రూపొందించనున్నారు. అధిక సామర్థ్యం ఉన్న కంప్యూటింగ్ సిస్టమ్స్‌ను నిర్వహించేందుకు లిక్విడ్-కూల్డ్ టెక్నాలజీతో ఈ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు కంపెనీ రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. ఈ ప్రాజెక్ట్ వల్ల హైదరాబాద్ ప్రాంతంలో నేరుగా, పరోక్షంగా వేలాది ఉద్యోగాలు వస్తాయని హైపర్‌వాల్ట్ తెలిపింది. ఈ మౌలిక సదుపాయాలను నిర్మించి నిర్వహించేందుకు హైపర్‌వాల్ట్, దాని భాగస్వాములు కలిసి రూ.70,000 కోట్ల వరకు పెట్టుబడి పెట్టనున్నారు. కస్టమర్ల అవసరాలు, టెక్నాలజీలో వచ్చే మార్పులను బట్టి ఈ ప్రాజెక్ట్‌ను దశలవారీగా చేపట్టనున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఈ ప్రాజెక్ట్‌ను రాష్ట్రానికి, దేశానికి "చారిత్రాత్మకమైనది"గా అభివర్ణించారు. ఏఐ విప్లవంలో హైదరాబాద్ ఇప్పుడు ప్రపంచ స్థాయిలో ముందంజలో ఉందని ఆయన అన్నారు. ముఖ్యంగా ఏఐకి అవసరమైన మౌలిక సదుపాయాలపై హైదరాబాద్ దృష్టి పెడుతోందని చెప్పారు. "ఈ దశాబ్దం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ది. ఏఐ మోడల్స్, వాటిని నడిపించే కంప్యూటింగ్ సామర్థ్యం వేగంగా ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలుగా మారుతున్నాయి. ఈ కంప్యూటింగ్ సదుపాయం తెలంగాణలో ఉండటం మనకు ఒక అదనపు ప్రయోజనం" అని రేవంత్ రెడ్డి అన్నారు. డేటా సెంటర్ క్యాంపస్ నిర్మాణంలో గ్రీన్ ఎనర్జీని ఉపయోగించడంతో పాటు, నీటి వినియోగాన్ని సమతుల్యం చేసే డిజైన్ విధానాలను పాటించనున్నట్లు కంపెనీ తెలిపింది. టీసీఎస్ సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ కె. కృతివాసన్ మాట్లాడుతూ, ఈ ప్రాజెక్ట్ తమ "ఇన్‌ఫ్రాస్ట్రక్చర్-టు-ఇంటెలిజెన్స్" వ్యూహాన్ని మరింత ముందుకు తీసుకెళ్తుందని చెప్పారు. ఏఐకి సిద్ధంగా ఉండే మౌలిక సదుపాయాలను టీసీఎస్ క్లౌడ్, ఏఐ, ఎంటర్‌ప్రైజ్ సామర్థ్యాలతో కలిపి ఈ ప్రాజెక్ట్‌ను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. "ప్రపంచవ్యాప్తంగా ఉన్న కస్టమర్ల అవసరాలను తీర్చేందుకు హైదరాబాద్‌కు అవసరమైన స్థాయి, ప్రతిభ, టెక్నాలజీ ఎకోసిస్టమ్ ఉన్నాయి" అని కృతివాసన్ అన్నారు. ఈ భారీ పెట్టుబడి ద్వారా ఏఐ, డేటా సెంటర్ల రంగంతోపాటు విద్యుత్, కూలింగ్, నెట్‌వర్కింగ్, నిర్మాణం, ఇంజినీరింగ్, ఆపరేషన్స్ వంటి అనుబంధ రంగాల్లో కొత్త అవకాశాలు ఏర్పడనున్నాయి. పర్యావరణానికి అనుకూలంగా గ్రీన్ ఎనర్జీ, వాటర్-న్యూట్రల్ డిజైన్‌తో ఈ క్యాంపస్‌ను అభివృద్ధి చేయనున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన చర్చలకు 2026 జనవరిలో దావోస్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టాటా సన్స్ చైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ మధ్య జరిగిన సమావేశం నాంది పలికింది. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం, టీసీఎస్ ప్రతినిధులతో పలుమార్లు చర్చలు జరిపి కొద్ది నెలల్లోనే ప్రాజెక్టును కార్యరూపంలోకి తీసుకొచ్చాయి.దేశంలోని మరో ఐదు రాష్ట్రాల నుంచి పోటీ ఉన్నప్పటికీ తెలంగాణ ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును సాధించింది. ఈ ప్రాజెక్టుతో హైదరాబాద్‌ను గ్లోబల్ ఏఐ, డేటా సెంటర్ హబ్‌గా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్యం మరింత చేరువైంది. ఈ కీలక సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రభుత్వ సలహాదారు కె. రామకృష్ణా రావు, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓ బి.అజిత్‌రెడ్డి, టీజీఐఐసీ ఎండీ కె. శశాంక, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణాదిత్య, డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రీస్ నిఖిల్ చక్రవర్తి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కేసీఆర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి

## - రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్

**తొలి అక్షరం/హైదరాబాద్,సెప్టెంబర్ 05:** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తన ఎమ్మెల్యే పదవికి తక్షణమే రాజీనామా చేయాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధిగా తన బాధ్యతలు నిర్వర్తించని వ్యక్తి ఆ పదవిలో కొనసాగడం సమంజసం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ విషయమై ఈ నెల 6న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద 'మహా ధర్నా' నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ ధర్నాకు సంబంధించిన సన్నాహక సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రానికి వందేళ్ల నష్టం వాటిల్లిందని విమర్శించారు. "వెయ్యి రోజులుగా ఎమ్మెల్యేగా వేతనం



తీసుకుంటున్న కేసీఆర్ అసెంబ్లీకి రావడం లేదని, కనీసం తన నియోజకవర్గ ప్రజలకు కూడా అందుబాటులో ఉండటం లేదు. ప్రతిపక్ష నేతగా ఆయన పూర్తిగా విఫలమయ్యారు" అని ఆరోపించారు. కేసీఆర్ వైఖరిని ప్రజల దృష్టికి తీసుకెళ్లడానికే ఈ నిరసన కార్యక్రమం చేపడుతున్నామని మంత్రి స్పష్టం చేశారు. ఇదే వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల ప్రజాపాలనలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తామని ఆయన తెలిపారు. ఈ మహా ధర్నాను విజయవంతం చేయాలని కాంగ్రెస్ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు.

# 4 రాష్ట్రాల్లో జనగణన

(మొదటి పేజీ తరువాయి)

జనాభా లెక్కల ప్రక్రియ ప్రారంభం కానుండగా, ఇది వచ్చే ఏడాది అంటే 2027 జనవరి 4 వరకు కొనసాగుతుంది. ఈ జనాభా గణనకు సంబంధించిన వివరాల్ని భారత రిజిస్ట్రార్ జనరల్ (RGI – రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా), సెన్సస్ కమిషనర్ మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ తాజాగా విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. అయితే ఈ 4 రాష్ట్రాల్లోని ప్రజలు ముందుగానే వారి వివరాల్ని నమోదు చేసుకునేందుకు స్వీయ గణన (సెల్ఫ్ ఎన్యుమరేషన్) సౌకర్యాన్ని కల్పించనున్నట్లు స్పష్టం చేశారు. ఈ ఆప్షన్ జనగణన అధికారిక ప్రక్రియ ప్రారంభమయ్యే ముందు 15 రోజులు అంటే 2026 నవంబర్ 16 నుంచి 30వ తేదీ వరకు అవకాశం ఉంటుందని తెలిపారు.

# ఉక్రెయిన్‌పై దాడులకు విరామం.. పుతిన్ కీలక ఆదేశం

(మొదటి పేజీ తరువాయి)

అధ్యక్షుడు పుతిన్ ఆదేశించారు. క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. యుద్ధం ముగింపు కోసం చర్చలు జరిపే ఉద్దేశంతో అమెరికా ప్రత్యేక ప్రతినిధులు స్టీవ్ విట్‌కాఫ్, జారెడ్ కుష్నర్‌లు మాస్కో చేరుకోవడంతో పుతిన్ తాజా ఆదేశాలిచ్చారు.

రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధాన్ని ముగించేందుకు కొత్త, స్పష్టమైన ప్రతిపాదన తన వద్ద ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ చెప్పిన మరుసటి రోజే అమెరికా ప్రత్యేక ప్రతినిధుల మాస్కో పర్యటన చోటుచేసుకుంది.కాగా, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ సైతం చర్చల వేళ దాడులు చేసుకోవద్దని శుక్రవారంనాడు రష్యాకు ప్రతిపాదించారు. తమ వైపు నుంచి ఎలాంటి దాడులు ఉండవని, ప్రత్యర్థి నుంచి కూడా ఇదే ఆశిస్తున్నామని చెప్పారు. ఉక్రెయిన్, రష్యా మధ్య వైమానిక దాడులు పెరిగిన సమయంలో ఈ దౌత్య ప్రయత్నాలు జరుగుతుండటం విశేషం. శుక్రవారం కీవ్‌లోని ఉక్రెయిన్ భద్రతా సంస్థ ఎస్‌బీయూ ప్రధాన కార్యాలయంపై రష్యా డ్రోన్ దాడి చేసింది. ఈ దాడిలో నలుగురు మరణించగా, పలువురు గాయపడ్డారు. యుద్ధం ప్రారంభమైన తర్వాత జరిగిన అత్యంత ప్రముఖ దాడుల్లో ఇది ఒకటిగా చెబుతున్నారు. రాత్రికి రాత్రి 167 డ్రోన్లను రష్యా ప్రయోగించినట్టు ఉక్రెయిన్ వైమానిక దళం తెలిపింది.

# ఈనెల 7 నుంచి అసెంబ్లీ సమావేశాలు

**తొలి అక్షరం/హైదరాబాద్,సెప్టెంబర్ 05:** సోమవారం నుంచి తెలంగాణ అసెంబ్లీ, శాసన మండలి వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో సభ లోపల, బయట ప్రశాంత వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ఆదేశించారు. సభ్యులు కోరిన సమాచారాన్ని సాధ్యమైనంత త్వరగా అందించాలని అధికారులకు సూచించారు. సమావేశాల నిర్వహణ, వసతులు, భద్రతా ఏర్పాట్లపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి శాసన వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఆర్థిక శాఖ అధికారులు, డీజీపీ, పోలీసు ఉన్నతాధికారులు హాజరయ్యారు. గత సమావేశాల కంటే వేగంగా, సమన్వయంతో పనిచేయాలని అధికారులకు చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సూచించారు. ఈసారి అసెంబ్లీ సమావేశాలు హాట్ హాట్‌గా జరిగే అవకాశం ఉందని గుత్తా అన్నారు.సభకు సంబంధించిన అన్ని శాఖల అధికారులు సమావేశాల సమయంలో అందుబాటులో ఉండాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి? ఆదేశించారు. సభ్యులకు అందించే మెటీరియల్‌ను తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో ముందుగానే అందించాలని సూచించారు. సభ లోపల, బయట ప్రశాంత వాతా వరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పీకర్, చైర్మన్ ఆదేశాలు జారీ చేశారు. ధర్నాలు, రాస్తారో కోలు జరగకుండా పోలీసు శాఖ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇంటెలిజెన్స్ సమాచారం వేగంగా అసెంబ్లీ అధికారులకు చేరేలా సమన్వయం చేయాలని ఆదేశించారు. సమావేశాల నిర్వహణ కోసం నోడల్ అధికారులను నియమించాలన్నారు.సభ్యుల ప్రశ్నలకు సంబంధించిన సమాధానాలను ఒకరోజు ముందే అందించాలని అధికారులను మంత్రి శ్రీధర్ బాబు ఆదేశించారు. ప్రతి శాఖ నుంచి ఒక అధికారి ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని సూచిం చారు. ఉభయ సభల సమావేశాలు ప్రభుత్వ కార్యనిర్వాహక వ్యవస్థ సమర్థతకు నిదర్శనమని శ్రీధర్ బాబు అన్నారు. ప్రభుత్వం తరఫున సమావేశాలకు పూర్తి స్థాయిలో సహకారం అందిస్తామని శ్రీధర్ బాబు హామీ ఇచ్చారు. పలు కీలక బిల్లులు ప్రవేశపెట్టడంతో పాటు, ప్రజలు ఎదుర్కొంటున్న పలు ముఖ్యమైన సమస్యలపై సుదీర్ఘంగా చర్చించే అవకాశాలు ఉన్నాయి. మరోవైపు, ప్రజా సమస్యలపై ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు విపక్షాలు కూడా సిద్ధమవుతున్నాయి. దీంతో ఈసారి వర్షాకాల సమావేశాలు వాడీవేడిగా సాగే సూచనలు కనిపిస్తున్నాయి. వర్షాకాల సమావేశాలు ఎన్ని రోజుల పాటు కొనసాగుతాయనేది బిజినెస్ అడ్వైజరీ కమిటీ-బీఏసీ సమావేశంలో నిర్ణయించనున్నారు.

# 'చెత్త సేకరణ'ను రాంకీకి అప్పగించొద్దు

(మొదటి పేజీ తరువాయి)

హెచ్చరించారు. శుక్రవారం హైదరాబాద్ బంజారాహిల్స్ లోని టీఆర్ఎస్ రాష్ట్ర కార్యాలయంలో ఆమె స్వచ్ఛ ఆటో కార్మికులతో సమావేశమయ్యారు. ప్రభుత్వం రాంకీ సంస్థకు చెత్త సేకరణ బాధ్యతలు అప్పగిస్తోందని, ప్రాపర్టీ ట్యాక్స్ లో కలిపి చెత్త పైసలు వసూలు చేస్తే తమ ఉపాధి దెబ్బతింటుందని కార్మికులు ఆమెతో వాపోయారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, రాంకీ సంస్థకు లాభం చేయడానికి స్వచ్ఛ ఆటో కార్మికుల పొట్టకొట్టేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వంతో సంబంధం లేకుండా స్వయం ఉపాధి పొందుతున్న వారిని రాంకీ సంస్థకు జీతగాళ్లుగా మార్చేందుకు ప్రభుత్వం ప్రయత్నించడం దారుణమన్నారు. స్వయం ఉపాధి ద్వారా మంచి ఆదాయం పొందుతున్న వారికి నెలకు రూ.16 వేలు మాత్రమే జీతం ఇచ్చేలా రేవంత్ రెడ్డి ప్రయత్నాలు చేస్తున్నారని తప్పుపట్టారు. హైదరాబాద్ లో 20 వేల ఆటోల ద్వారా 40 వేల మంది స్వచ్ఛ ఆటో కార్మికులు ఇంటింటి నుంచి చెత్త సేకరిస్తూ స్వయం ఉపాధి పొందుతున్నారని తెలిపారు. చెత్త సేకరణ యథావిధిగా కార్మికులతోనే చేయించాలని ఆమె డిమాండ్ చేశారు. స్వచ్ఛ ఆటో కార్మికులకు ప్రభుత్వం రూ.20 లక్షల ఇన్సూరెన్స్ చేయించాలని డిమాండ్ చేశారు. రాంకీ సంస్థ నిర్వహిస్తున్న డంపింగ్ యార్డ్ వద్ద కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో దీనిపై సీఎం స్పష్టత నివ్వాలన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం భూదందా సాగిస్తోంది

**తొలి అక్షరం/హైదరాబాద్,సెప్టెంబర్ 05:**

సామాన్యుల ఆస్తులు, రైతుల పొలాలను లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ ప్రభుత్వం భూదందా సాగిస్తోందని తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు విమర్శించారు. 22ఏ నిషిద్ధ జాబితా పేరుతో పేద, మధ్యతరగతి ప్రజల సొంత భూములను లాక్కునేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ కుట్ర పన్నుతోందని ఆరోపించారు. ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి నాయకత్వంలో ఈరోజు జరిగిన మహాధర్నాకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజల భూములపై పడ్డ ఏ పాలకుడు చరిత్రలో బాగుపడలేదని హెచ్చరించారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం 'ధరణి'తో ప్రజలను పీడించి ఏ విధంగా అధికారానికి దూరమైందో... ఇప్పుడు రేవంత్ రెడ్డి కూడా అదే బాటలో పయనిస్తూ తన గోతిని తానే తవ్వుకుంటున్నారని మండిపడ్డారు. హైడ్రా, క్యూర్, 22ఏ వంటి నిర్ణయాలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ, 30 శాతం కమీషన్ల కోసం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి భవిష్యత్తులో బీఆర్ఎస్ కంటే దారుణమైన పరాభవం తప్పదని స్పష్టం చేశారు. వెంటనే 22ఏ కింద చేర్చిన బాధితుల భూములపై రివ్యూ జరిపి, ఆ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు బీజేపీ రాజీలేని పోరాటం చేస్తుందని తేల్చిచెప్పారు.

# ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చేతుల మీదుగా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

**- బీసీల రాజ్యాధికారానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి: తీన్మార్ మల్లన్న**



**తొలి అక్షరం/చౌటుప్పల్. సెప్టెంబర్ 5:** చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లికి చెందిన బోలమోని శంకరయ్య కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎం రిలీఫ్ ఫండ్ ) ద్వారా మంజూరైన రూ.26,000/- విలువైన చెక్కును నల్గొండవరంగల్ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ, తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధ్యక్షులు తీన్మార్ మల్లన్న, అడ్వకేట్ గట్టు మొగలయ్య ముదిరాజ్ చేతుల మీదుగా శనివారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్సీ కార్యాలయంలో కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా తెలంగాణ రాజ్యాధికార పార్టీ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రజల తరఫున తమ వంతు కృషి కొనసాగిస్తామని పేర్కొన్నారు. బీసీలకు రాజ్యాధికారం సాధించడమే లక్ష్యంగా ప్రతి ఒక్క బీసీ ప్రజలు భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. బీసీ, పేద వర్గాల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం తెలంగాణ రాజ్యాధికార పార్టీ నిరంతరం ప్రజల పక్షాన నిలుస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బోలమోని శంకరయ్య కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగ యువతకు బొల్లా శివశంకర్ భరోసా!

**ఆసరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో**

**పుట్టపాక లో మెగా జాబ్ మేళా**

**ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న**

**యువతకు అద్భుత అవకాశం**

**భారీగా ఉద్యోగ అవకాశాల కల్పనకు కృషి**

**బొల్లా శివశంకర్ మాజీ జడ్పిటిసి ఆసరా**

**ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు**

**తొలి అక్షరం/చౌటుప్పల్. సెప్టెంబర్ 5:** చౌటుప్పల్ నిరుద్యోగ యువతకు అండగా నిలుస్తూ, వారికి ఉపాధి అవకాశాలు కల్పించాలనే సంకల్పంతో ఆసరా ఫౌండేషన్ వ్యవస్థాపకులు, మాజీ జెడ్పీటీసీ బొల్లా శివశంకర్ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. "నిరుద్యోగ యువతకు ఉద్యోగం.. ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా" అనే లక్ష్యంతో బొల్లా శివశంకర్ చేస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా ఈ మెగా జాబ్ మేళాను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు, వారి భవిష్యత్‌కు భరోసా కల్పించేందుకు ఆసరా ఫౌండేషన్ నిరంతరం కృషి చేస్తోందన్నారు. **సెప్టెంబర్ 27న మెగా జాబ్ మేళా** 2026 సెప్టెంబర్ 27వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు బొల్లా శివశంకర్ తెలిపారు. వివిధ రంగాలకు చెందిన సంస్థలు, కంపెనీల ప్రతినిధులు పాల్గొని అర్హత కలిగిన అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారని చెప్పారు. విద్యార్హతలు ఉన్నప్పటికీ ఉద్యోగం లేక ఇబ్బందులు పడుతున్న యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బొల్లా శివశంకర్ పిలుపునిచ్చారు. ఉద్యోగం సాధించాలనే పట్టుదల ఉన్న ప్రతి ఒక్కరికీ ఈ జాబ్ మేళా మంచి వేదికగా నిలుస్తుందని అన్నారు. "యువతకు ఉద్యోగం లభిస్తే ఒక వ్యక్తి జీవితం మాత్రమే కాదు.. ఒక కుటుంబం భవిష్యత్తు మారుతుంది" అనే ఆలోచనతో జాబ్ మేళాను నిర్వహిస్తున్నామని బొల్లా శివశంకర్ తెలిపారు. ఆసరా ఫౌండేషన్ లైవ్ లైఫ్ … గివ్ లైఫ్ జాబ్ మేళా వివరాలకు: 8790317434



# ట్రినిటీ హైస్కూల్లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

- **ఒక్కరోజు ఉపాధ్యాయులుగా మారిన విద్యార్థులు**
- **స్వపరిపాలన దినోత్సవంలో భాగంగా బోధన**




**తొలి అక్షరం/చౌటుప్పల్: సెప్టెంబర్ 5:** చౌటుప్పల్‌లోని ట్రినిటీ హైస్కూల్లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పాఠశాల డైరెక్టర్ కం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. సాధారణ ఉపాధ్యాయ స్థాయి నుంచి భారతదేశ ప్రథమ పౌరుడైన రాష్ట్రపతి స్థాయికి అంచెలంచెలుగా ఎదిగిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని అన్నారు. ఆయన జన్మదినాన్ని దేశవ్యాప్తంగా ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్నామని విద్యార్థులకు వివరించారు. స్వపరిపాలన దినోత్సవంలో భాగంగా విద్యార్థులు ఒక్కరోజు ఉపాధ్యాయులుగా మారి తరగతి గదుల్లో తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఉపాధ్యాయులుగా బాధ్యతలు నిర్వహించిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మంజుల అభినందించారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుతమైన ఆలోచనా విధానం, ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ కె.వి.బి. కృష్ణారావు, కోఆర్డినేటర్లు ఎం. శివరాణి, శివాని, నీరజ, మంజుల, స్వప్న, కొండమ్మ, జ్యోతి, సబిత, లోకుమారి, స్వప్న, అనూష తదితరులు పాల్గొన్నారు.

# చెక్క పాపయ్య ఆశయ సాధనకు సీపీఎం ముందుకు సాగాలి

**ప్రజా ఉద్యమాల్లో క్రియాశీలకంగా పనిచేసిన చెక్క పాపయ్య సేవలు చిరస్మరణీయం: బూర్గు కృష్ణారెడ్డి**



**తొలి అక్షరం/చౌటుప్పల్ సెప్టెంబర్ 5:** చౌటుప్పల్ మండలం చిన్న కొండూరు గ్రామం లో భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) చిన్న కొండూరు గ్రామ శాఖ ఆధ్వర్యంలో సీపీఎం పార్టీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ చెక్క ఉప్పలమ్మ భర్త, దివంగత చెక్క పాపయ్య స్మారక స్తూపాన్ని శనివారం ఆవిష్కరించారు. మూడు నెలల క్రితం చెక్క పాపయ్య మృతి చెందారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బూర్గు కృష్ణారెడ్డి స్మారక స్తూపాన్ని ఆవిష్కరించగా, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు చీమకండ్ల శ్రీరాములు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. పార్టీ మండల కార్యదర్శివర్గ సభ్యులు చింతల సుదర్శన్ అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బూర్గు కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. చెక్క పాపయ్య సీపీఎం పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తూ అనేక ప్రజా ఉద్యమాల్లో పాల్గొన్నారని గుర్తుచేశారు. కందాల రంగారెడ్డి నాయకత్వంలో జీతగాళ్ల సంఘాలను ఏర్పాటు చేసి, "గీసేవారికి చెట్టు.. దున్నేవాడికే భూమి" అనే నినాదంతో సాగిన అనేక పోరాటాల్లో పాల్గొని ఉద్యమాలను ముందుకు తీసుకెళ్లారని తెలిపారు. గ్రామంలో ఎలాంటి చిన్నా పెద్దా పంచాయతీలు జరిగినా, ఇతర సామాజిక కార్యక్రమాల్లోనూ పెద్దమనిషిగా పాల్గొని సమస్యలను ముక్కుసూటిగా మాట్లాడే వ్యక్తిగా చెక్క పాపయ్యకు మంచి పేరు ఉందన్నారు. ఆయన ప్రజా సేవలు, పార్టీకి చేసిన సేవలు ఎప్పటికీ మరువలేనివని పేర్కొన్నారు. చెక్క పాపయ్య ఆశయాలను కొనసాగించాల్సిన బాధ్యత గ్రామ శాఖపై ఉందని, ఆయన ఆశయ సాధన కోసం సీపీఎం గ్రామ శాఖ నిరంతరం పనిచేస్తుందని కృష్ణారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్, పార్టీ మండల కమిటీ సభ్యులు ఆదిమూలం నందీశ్వర్, చెరుకు లక్ష్మమ్మ, కొండే శ్రీశైలం, శాఖ సహాయ కార్యదర్శి ఘర్ష నరసింహ, పార్టీ మాజీ ఎంపీటీసీలు నత్తి చంద్రమ్మ, శంకరయ్య, ఎలక రాజు, యాదగిరి, మాజీ ఉపసర్పంచులు చింతపల్లి నరసింహారెడ్డి, దీప అంజిరెడ్డి, వార్డు సభ్యులు ఘర్ష శ్రీకాంత్, చెక్క సేను తదితరులు పాల్గొన్నారు. అలాగే చీమకండ్ల రామచంద్రం, చెక్క బిక్షం, చెక్క కిష్టయ్య, చెక్క గంగయ్య, చెక్క యాదయ్య, చీమకండ్ల కిష్టయ్య, చింతల మధు, శ్రీరాములు, నిర్మల్ తదితరులు పాల్గొన్నారు.

# పంతంగిలో ఘనంగా శ్రీ ముత్యాలమ్మ తల్లి విగ్రహా ప్రతిష్ఠాపన

- **భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ప్రతిష్ఠాపన మహోత్సవం.. భారీగా తరలివచ్చిన భక్తులు**



**తొలి అక్షరం/చౌటుప్పల్, సెప్టెంబర్ 05:** చౌటుప్పల్ మండలం పంతంగి గ్రామంలో శ్రీ ముత్యాలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామంలో నూతనంగా ప్రతిష్ఠించనున్న శ్రీ ముత్యాలమ్మ తల్లి విగ్రహాన్ని డప్పు చప్పుళ్లు, ఆటపాటల నడుమ గ్రామ ప్రధాన వీధుల గుండా అంగరంగ వైభవంగా ఊరేగించారు. ఊరేగింపులో పాల్గొన్న భక్తులు, గ్రామ పెద్దలు, యువకులు "జై ముత్యాలమ్మ తల్లి" అంటూ భక్తి నినాదాలు చేశారు. దీంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అనంతరం ఆలయంలో వేద పండితుల వేద మంత్రోచ్ఛరణల మధ్య అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. కుంకుమ పూజలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ప్రతిష్ఠాపన అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులు, గ్రామ ప్రజలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భారీ సంఖ్యలో భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# పాలనలో 'రేవంత్' విజయోత్సవం.. మహబూబాబాద్‌లో హోరెత్తిన బైక్ ర్యాలీ!

**తెలంగాణ సమగ్ర వికాసానికి**

**1000 రోజుల సంక్షేమ నవశకం**

**డిసిసి అధ్యక్షురాలు ఉమా మురళి**

**నాయక్ నేతృత్వంలో విజయవంతం**

**అభయహస్తం హామీల అమలుతో**

**ఊరూరా హర్షాతిరేకాలు**



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ సెప్టెంబరు 5:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలో జిల్లా కాంగ్రెస్ కమిటీ (డిసిసి) అధ్యక్షురాలు ఉమా మురళి నాయక్ అధ్యక్షతన విజయోత్సవ బైక్ ర్యాలీ ఘనంగా జరిగింది. పట్టణ పురవీధుల గుండా సాగిన ఈ ర్యాలీలో కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని జై కాంగ్రెస్, జై రేవంత్ రెడ్డి నినాదాలతో హోరెత్తించారు. **పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పాలన** ర్యాలీ అనంతరం ఏర్పాటు చేసిన సభలో డిసిసి అధ్యక్షురాలు ఉమా మురళి నాయక్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజా సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతోందన్నారు. మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, గృహజ్యోతి ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతులకు రైతు భరోసాతో పాటు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ, నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, యువతకు భారీగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుందని వివరించారు. **అభివృద్ధి పథంలో తెలంగాణ రాష్ట్రం** రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పన, రహదారులు, విద్య, వైద్యం, సాగునీరు తదితర రంగాలపై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. 1000 రోజుల పాలనలో తెలంగాణ ప్రజలకు అందించిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లడమే ఈ విజయోత్సవ బైక్ ర్యాలీ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటున్నామని, రాబోయే రోజుల్లో తెలంగాణను ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు. **భారీగా తరలివచ్చిన కాంగ్రెస్ శ్రేణులు** ఈ విజయోత్సవ కార్యక్రమంలో మహబూబాబాద్ నియోజకవర్గంలోని కేసముద్రం మండల పార్టీ అధ్యక్షుడు చిలువేరు సమ్మీ గౌడ్, గూడూరు మండల అధ్యక్షుడు బాలాజీ నాయక్, మహబూబాబాద్ మండల అధ్యక్షుడు బెల్లంకొండ శ్రీనివాస్, నెలకుదురు మండల అధ్యక్షుడు ఎదల్ల యాదవ రెడ్డి, ఇనుగుర్తి మండల అధ్యక్షుడు బైరు అశోక్ గౌడ్‌లతో పాటు వివిధ మండలాల నాయకులు, ప్రజా ప్రతినిధులు, యువజన, మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# కేజీబీవీలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన

**● షేర్‌జెఆర్సీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు.. ● విద్యార్థినులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం**




**తొలిఅక్షరం/మహబూబాబాద్ సెప్టెంబర్ 5:** మహబూబాబాద్ పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. 'షేర్' స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో, జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్స్ (జెఆర్సి) విభాగం సహకారంతో ఈ కార్యక్రమం జరిగింది.జెఆర్సి మహబూబాబాద్ జిల్లా కోఆర్డినేటర్ శ్రీకాంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ నాగవాణి మాట్లాడుతూ.. సమాజంలో పేరుకుపోయిన సామాజిక అసమానతలు, అనాచారాల నిర్మూలనలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. కేవలం పుస్తకాల్లోని విద్యను అందించడం మాత్రమే కాకుండా, పిల్లలను బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దే శక్తి ఉపాధ్యాయులకు ఉందన్నారు.బాల్యవివాహాలు, బాలకార్మిక వ్యవస్థ, వివక్ష వంటి సామాజిక రుగ్మతలను రూపుమాపడంలో గురువుల పాత్ర ఎనలేనిదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం జూనియర్ కళాశాల ఉపాధ్యాయులందరినీ శాలువాలతో సత్కరించారు.

**'బాల్య వివాహ రహిత భారత్'పై అవగాహన** అనంతరం షేర్ స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ శ్రీకాంత్ రెడ్డి విద్యార్థినులకు 'బాల్య వివాహ రహిత భారత్' అంశంపై ప్రత్యేక అవగాహన కల్పించారు. బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలు, వాటిని అరికట్టాల్సిన అవసరంపై వివరించారు. ఆపదలో ఉన్నప్పుడు లేదా బాల్యవివాహానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే 1098 (చైల్డ్ హెల్ప్‌లైన్), 181 (మహిళా హెల్ప్‌లైన్) నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు.

**ఉచిత న్యాయ సహాయం అందిస్తాం** జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సీనియర్ న్యాయవాది చెన్న మల్లా రెడ్డి, అసిస్టెంట్ డిఫెన్స్ కౌన్సెల్ రాజకృష్ణ మాట్లాడుతూ.. సమాజ నిర్మాణంలో, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు పోషిస్తున్న పాత్రను కొనియాడారు. తల్లిదండ్రులు జన్మనిస్తే.. ఉపాధ్యాయులు ఆ జీవితానికి సార్థకతను, సరైన మార్గాన్ని చూపిస్తారని అన్నారు. గురువులను గౌరవించడం ద్వారా విద్యార్థులు ఉన్నతమైన సంస్కారాన్ని అలవర్చుకోగలరని పేర్కొన్నారు. బాధితులకు అవసరమైన న్యాయ సహాయాన్ని జిల్లా న్యాయ సేవా ధికార సంస్థ ఉచితంగా అందిస్తుందని తెలిపారు. ఉచిత న్యాయ సలహా, సహాయం కోసం టోల్‌ఫ్రీ నంబర్ 15100ను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేక అధికారిణి భవాని, 'సఖి' నుంచి షాజన్, లావణ్య, షేర్‌జెఆర్సీ కమ్యూనిటీ మొబిలైజర్లు రమేష్, సోమన్న, హిమబిందు, ఉమా మహేశ్వరి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థినులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

**● రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుతో జయ కాగడకు గౌరవం**







**తొలి అక్షరం/షాద్ నగర్, సెప్టెంబర్05:** షాద్‌నగర్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకులను సన్మానించి, సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్రను కొనియాడారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్. కమల మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన జీవితాన్ని అలవర్చుకోవాలని, గురువుల పట్ల గౌరవభావం కలిగి ఉండాలని సూచించారు. ఉపాధ్యాయుల మార్గనిర్దేశంతో ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు.అర్థశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ పి. సత్యనారాయణ మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో గురువులు మూలస్తంభాలని, విద్యాభివృద్ధితోనే దేశ ఆర్థిక ప్రగతి సాధ్యమవుతుందని తెలిపారు. ఐక్యూఏసీ కోఆర్డినేటర్ విద్యార్థులు వినయం, విధేయతతో మెలగాలని సూచించారు.కళాశాల వాణిజ్యశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ జయ కాగడ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికై, కొడంగల్‌లో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణా చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, విద్యార్థులు ఆమెకు అభినందనలు తెలిపారు.

## సీఎం రేవంత్ రెడ్డి, టిపిసిసి చీఫ్ మహేష్ గౌడ్‌ను ఘనంగా సన్మానించిన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దైద రవీందర్





**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 5:** నకిరేకల్‌లో నిర్వహిం చిన ప్రజాపాలన ప్రగతి సభకు, పలు అభివృద్ధి కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర ముఖ్య మంత్రి ఏనుమల రేవంత్ రెడ్డిని, టి పి సి సి అధ్యక్షులు బొమ్మగాని మహేష్ కుమార్ గౌడ్ ని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలతో కలిసి పూల బొకే, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## క్రిష్ణవేణి పాఠశాలలో ఘనంగా గురుపూజోత్సవం




**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 5:**రామన్నపేట మండల కేంద్రంలో ఉన్న కృష్ణవేణి టాలెంట్ హై స్కూల్ లో ఉపాధ్యాయుల దినోత్సవ కార్యక్రమం ఘనంగా జరుపుకున్నారు ఈ కార్యక్రమంలోపాలొన్నానవారు.. కరెస్పాండెంట్ గంగుల నరేందర్ రెడ్డి, ప్రిన్సిపాల్ బి.సురేష్, అకాడమిక్ డైరెక్టర్ జె.మణి. తదితరులు పాల్గొన్నారు

## తెలంగాణ జర్నలిస్టుల జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బత్తుల గణేష్



**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 5:**తెలంగాణ జర్నలిస్ట్ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నల్గొండ జిల్లా రామన్నపేటకు చెందిన సంచలనం జాతీయ పత్రిక చీఫ్ ఎడిటర్ బత్తుల గణేష్ నియమితులయ్యారు. జేఏసీ చైర్మన్ తొగరి కరుణాకర్ ఆదేశాలతో ఈ నియామకం జరిగింది. గణేష్ మాట్లాడుతూ.. తనపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలుపుతూ, జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల కోసం అన్ని వర్గాల జర్నలిస్టులను కలుపుకుని కృషి చేస్తానని తెలిపారు.

# సంతాపూర్ కొండపై ఘనంగా పానకాల నరసింహుడి జాతర

**● భక్తిశ్రద్ధలతో పానకాల లక్ష్మీ నరసింహస్వామి**

**● మాజీ జెడ్పీటీసీ తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి**





**తొలి అక్షరం/షాద్ నగర్,సెప్టెంబర్ 05:** కేశంపేట మండలం సంతాపూర్ గ్రామంలోని కొండపై ప్రకృతి రమణీయమైన అటవీ ప్రాంతంలో కొలువుదీరిన శ్రీ పానకాల లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో జాతర, ప్రత్యేక పూజలు శనివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కొండపై అటవీ అందాల మధ్య వెలసిన ఆలయం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. కేశంపేట మాజీ జడ్పీటీసీ తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్పంచ్ బార్కం యాదయ్య కూడా ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. గ్రామ ప్రజలు, భక్తుల సహకారంతో జాతర విజయవంతంగా కొనసాగింది.

# చీకటిని ప్రశ్నిద్దాం... వెలుగును సాధిద్దాం.....

ఓట్ల వేళ వెలుగుల హామీలు,
గెలిచాక చీకటి పాలనలు
మాటల్లో 24 గంటల కరెంటు,
మా ఇళ్లలో మాత్రం గంటల
తరబడి చీకటి!
పిల్లల చేతిలో పుస్తకాలు,
చదువుకోవాలంటే కరెంటు లేదు
రైతు చేతిలో మోటారు,
పంటకు నీళ్లు పోయాలంటే
కరెంటు లేదు
వృద్ధులు ఉక్కపోతతో
అల్లాడుతుంటే,
చిన్నారులు నిద్ర కోసం
ఎదురుచూస్తుంటే,
ప్రజల కష్టాలు కనిపించవా?
పాలకుల కళ్లకు ఈ చీకటి
కనబడదా?
బిల్లులు మాత్రం సమయానికి
రావాలి,
కట్టకపోతే జరిమానాలు పడాలి
మరి కరెంటు ఇవ్వాల్సిన బాధ్యత
ఎవరిపై వేయాలి చెప్పండి?
ప్రజలు అడిగేది
రాజభవనాలు కాదు,
వెండి రోడ్లు కాదు
చదువుకునే పిల్లలకు వెలుగు,
రైతు పొలానికి నీరు,
ప్రతి ఇంటికీ నిరంతర విద్యుత్!
హామీల్లో వెలుగు చూపించి,
వాస్తవంలో చీకటి మిగల్చొద్దు
ప్రజల సహనాన్ని పరీక్షించొద్దు
కరెంట్ కావాలి.. కబుర్లు కాదు!


**– బూర రజనీకాంత్**



# పెండ్లి అయిన ప్రతి ఆడబిడ్డకు రూ.3వేలు, వ్యక్తి మరణిస్తే రూ.4వేలు..

**● రెడ్డికుంట తండా సర్పంచ్ యమునా రాకేష్**

**● మాజీ మంత్రి దయాకర్ రావు సమక్షంలో ఆడబిడ్డకు నగదు పంపిణీ...**




**తొలి అక్షరం/పెద్దవంగర, సెప్టెంబర్ 05:** స్థానిక ఎన్నికల ప్రచారంలో రెడ్డికుంట తండా సర్పంచ్ అభ్యర్థి బానోతు యమునా రాకేష్ మ్యానిఫెస్టో విడుదల చేసి ఇచ్చిన మాట ప్రకారం హామీలను గెలుపొందిన వెంటనే అమలుపరుస్తున్నారు. శనివారం మండల కేంద్రంలోని సాయి గార్డెన్స్ లో రెడ్డికుంట తండా జీపీ చెందిన ఆడబిడ్డ అంగోతు విమల – వినయ్ వివాహ వేడుకలకు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావును ఆహ్వానించి దయాకర్ రావు చేతుల మీదుగా రూ.3వేల నగదును వివాహ వేడుకల్లో అందించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి దయాకర్ రావు మాట్లాడుతూ.. రెడ్డి కుంట తండా సర్పంచ్ తండావాసులకు ఇచ్చిన మేనిఫెస్టో హామీ ప్రకారం .. హామీలను నెరవేర్చడం అభినందనీయమన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో గెలిస్తే 10 గ్యారెంటీలు అమలు చేస్తానని హామీ ఇచ్చి..ఇప్పటికే తండాలో మృతి చెందిన దాదాపు 6 కుటుంబాలకు రూ.4వేలు అందించడం జరిగిందని, జిపిలో అభివృద్ధికి కావలసిన నిధులను అందించి ఆదర్శవంతమైన జిపిగా తీర్చిదిద్దుతున్న యమునా రాకేష్ ను అభినందించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆడబిడ్డలకు ఇచ్చిన హామీలను ఇప్పటికి నెరవేర్చలేదని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ పాలకుర్తి దేవస్థానం చైర్మన్ రామచంద్రయ్య శర్మ, మండల పార్టీ అధ్యక్షులు ఈదురు ఐలయ్య మాజీ జిసిసి చైర్మన్ గాంధీ నాయక్, బీఆర్ఎస్ నేతలు సంజయ్. సుదీర్. గోపాల్ నాయక్. తదితరులు పాల్గొన్నారు

# అభివృద్ధి పనుల్లో నాణ్యతకు పెద్దపీట

**● ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలి: ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్**




**తొలిఅక్షరం/మహబూబాబాద్ సెప్టెంబర్ 5:** సీరోల్,డోర్నకల్ మండలాల సమగ్ర అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్ సూచించారు. సీరోల్, డోర్నకల్ మండల కేంద్రాల్లో నిర్వహించిన జనరల్ బాడీ సమావేశాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయా మండలాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, మౌలిక వసతుల కల్పన, స్థానిక సమస్యలపై ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రజలకు సంబంధించిన సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పరిష్కరించాలని ఎమ్మెల్యే సూచించారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అభివృద్ధి కార్యక్రమాల అమలులో నాణ్యత, పారదర్శకత విషయంలో రాజీ పడొద్దని స్పష్టం చేశారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను దశలవారీగా మెరుగుపరుస్తూ మండలాల అభివృద్ధికి మరింత ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని, ఆయా ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు చివరి లబ్ధిదారుడి వరకు చేరేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ ఉండాలని సూచించారు.ఈ సమావేశాల్లో సీరోల్, డోర్నకల్ మండలాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా గురుపూజోత్సవ వేడుకలు




**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 5:** స్థానిక వివేకానంద హై స్కూల్ లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. పాఠశాల వ్యవస్థాపకులు తిరుగుడు మల్లికార్జున్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో గురువుల పాత్ర కీలకమన్నారు. అనంతరం విద్యార్థులు ఉపాధ్యాయులను శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెలిమినేటి మల్లేష్, ఉప ప్రధానోపాధ్యాయురాలు అస్మా, ఉపాధ్యాయులు నాగరాజు, ముత్యాలు, స్వామి, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

# 14 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి



**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 5:** రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న 14 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ధర్మ సమాజ్ పార్టీ మండల అధ్యక్షులు బందెల అశోక్ డిమాండ్ చేశారు. శుక్రవారం బీసీ ఎస్సీ ఎస్టీ జాక్& డి.ఎస్.పి కమిటీల ఆధ్వర్యంలో ఎమ్మార్వో కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బకాయిల కారణంగా 30 లక్షల మంది బీసీ ఎస్సీ ఎస్టీ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, చదువులు మధ్యలోనే ఆగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు మల్లేష్, కార్యదర్శి స్వామి, నరేందర్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్‌ను తిట్టడమే తప్పు.. పాలనపై సీఎం రేవంత్‌కు ధ్యాస లేదు

- 420 హామీలను మరిచిన కాంగ్రెస్.. ప్రజలు అష్టకష్టాలు: అంజయ్య యాదవ్
- వెయ్యి రోజుల పాలనలో కాంగ్రెస్ విఫలం.. బీఆర్ఎస్ ధర్నా, ర్యాలీ






**తొలి అక్షరం/షాద్ నగర్,సెప్టెంబర్05:** కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో అన్ని రంగాల్లో విఫలమైందని మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలన తీరును నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శనివారం షాద్‌నగర్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. అనంతరం పట్టణంలో భారీ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా అంజయ్య యాదవ్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి మాజీ సీఎం కేసీఆర్‌ను విమర్శించడంపైనే దృష్టి సారిస్తున్నారని, రాష్ట్ర పాలనపై మాత్రం శ్రద్ధ చూపడం లేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన 420 హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం మరిచిపోయిందని ఆరోపించారు. పేరుకే ప్రజాపాలన అని చెబుతున్నా ప్రజల సమస్యలను పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ సక్రమంగా అమలు చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, పాలిటెక్నిక్ విద్యపై తీసుకున్న నిర్ణయాలు కూడా ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేసి ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రైతుబంధు, రైతుబీమా, మిషన్ కాకతీయతో పాటు పలు సంక్షేమ పథకాలు అమలు చేశామని గుర్తుచేశారు. సొంత జిల్లాకు సాగునీరు అందించలేని పరిస్థితిలో సీఎం ఉన్నారని విమర్శించారు. అనంతరం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, యువత భారీ ర్యాలీ నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పీఎంశ్రీ జెడ్‌పిహెచ్‌ఎస్ వెల్లంకిలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం




**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 5:** పీఎం శ్రీ జడ్పిహెచ్ఎస్ వెల్లంకిలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా తూటి . మురళీధర్ హాజరయ్యారు. తలారి. లింగయ్య ఈ కార్యక్రమానికి సహకారం అందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులందరినీ మురళీధర్, లింగయ్య సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థులు కష్టపడి చదివి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తేవాలని, సర్వేపల్లి రాధాకృష్ణన్ ను ఆదర్శంగా తీసుకోవాలని మురళీధర్ సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జి. సురేందర్ రెడ్డి, ఉపాధ్యాయులు ఎం. సత్తిరెడ్డి, శ్రీవాణి రెడ్డి, రవి కుమార్, శివారెడ్డి, చక్రధర్, సోమలత, ఉమామహేశ్వరి, జ్యోతి, స్వప్న, శేఖర్, వసంత, శైలజ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల పైన గురుతర బాధ్యత ఎంతైనా ఉంది

- సెయింట్ థెరిస్సా హైస్కూల్లో ఘనంగా గురుపూజోత్సవం
- సెయింట్ థెరిస్సా హై స్కూల్ ప్రిన్సిపల్,కరస్పాండెంట్ చల్లా మమతయాకూబ్ రెడ్డి





**తొలి అక్షరం/నెక్కొండ సెప్టెంబర్ 5:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలోని సెయింట్ తెరిస్సా హైస్కూల్లో ఘనంగా గురుపూజోత్సవ దినోత్సవాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ అండ్ కి రెస్పాండెంట్ చల్లా మమతా యాకూబ్ రెడ్డి మాట్లాడుతూ భారత ఉప రాష్ట్రపతి అయిన సర్వేపల్లి రాధాకృష్ణ పుట్టినరోజు సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకుంటూ సమాజంలో విద్యార్థిని, విద్యార్థులను నవ సమాజ నిర్మాతలుగా తీర్చిదిద్దే గురుతర బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ఉపాధ్యాయులే నవ సమాజాన్ని నిర్మించే ఎలాంటి స్వార్థం లేనటువంటి ఉద్యోగాన్ని నిర్వహించడం జరుగుతుందని,విద్యార్థులకు విజ్ఞానాన్ని, అందించే పాఠశాలలనే కోవెలగా తీర్చిదిద్దడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులచే ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు శాలువాతో బొకేతో చిరు సత్కారాన్ని అందించి, గురుపూజోత్సవాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని,ఉపాధ్యాయులు యమ్, దేవేందర్, రమేష్, శ్రీహరి, కృపాకర్, సుధాకర్, అనిత,కవిత, స్వప్న ,పుష్పలత , మాధవి,శ్రావణి, సబిత, మౌనిక, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొనడం జరిగింది.

# ఉపాధ్యాయుల పై గురుతర బాధ్యత ఉంది

- హైస్కూల్ హెచ్ఎం శ్రవణ్ కుమార్





**తొలి అక్షరం/నెక్కొండ సెప్టెంబర్ 5:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల పరిధిలోని అప్పలరావుపేటలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు విద్యార్థులకు దిశా దశ నిర్దేశం చేసే గురుతర బాధ్యత ఉపాధ్యాయుల పైనే ఉందని నెక్కొండ మండలం అప్పలరావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బూరుగుపల్లి శ్రవణ్ కుమార్ అన్నారు. నెక్కొండ మండలం అప్పలరావుపేట జెడ్పీ హైస్కూల్ లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెడ్మాస్టర్ తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి ఆయన సేవలను కొనియాడారు అనంతరం జరిగిన సమావేశంలో సభాధ్యక్షులు శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ తల్లిదండ్రులు జన్మనిస్తే ఆ జన్మకు సార్ధకతను చేకూర్చ డానికి ఉపాధ్యాయులు శ్రమిస్తారని, విద్యార్థులను పరిపూర్ణ వ్యక్తులుగా తీర్చిదిద్ది ఆదర్శవంతమైన సమాజ రూపకల్పనలో భాగస్వాములు అవుతారని గుర్తు చేశారు. ఏ రంగంలో రాణించాలన్న ఉపాధ్యాయులే కీలక భూమిక పోషిస్తారని, గురువుల పట్ల గౌరవభావం, స్వీయ క్రమశిక్షణతో నిర్దిష్ట లక్ష్యాలను ఏర్పరచుకొని ముందుకు సాగే వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రధానోపాధ్యాయులు శ్రవణ్ కుమార్ తో పాటు పాఠశాల ఉపాధ్యాయులు రవీంద్రనాథ్ ,గీత యాకయ్య, భూలక్ష్మి వెంకట్రాజం ,దయాకర్ లను విద్యార్థులు ఈ సందర్భంగా పూలమాల శాలువాతో సత్కరించారు కార్యక్రమంలో సునీత, సూరయ్య, కనకతారతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందచేసిన టీపీసీసీ సభ్యులు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి

**తొలి అక్షరం/నెక్కొండ సెప్టెంబర్ 5:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం లో ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి సహాయ నిధి నుండి ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సహకారం తో లబ్ధిదారులు మెరుగు సంధ్య కి 38000వేల రూపాయల చెక్కు ను అందచేసిన టీపీసీసీ సభ్యులు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి, నెక్కొండ సర్పంచ్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పెండ్యాల హరిప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి బక్కి అశోక్,మండల అధ్యక్షులు లావుడియా తిరుమల్ సొసైటీ చైర్మన్స్ మాదటి శ్రీనివాస్, ఆవుల శ్రీనివాస్ పట్టణ అధ్యక్షులు ఇదునూరి సాయికృష్ణ మార్కెట్ డైరెక్టర్ రావుల మహిపాల్ రెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు పోలిశెట్టి బాను వార్డ్ సభ్యులు మెరుగు విజయ్ సోషల్ మీడియా కన్వీనర్ రావుల తిరుపతి రెడ్డి సర్పంచ్ ల ఫోరం మండల అధ్యక్షులు భూక్యా రమేష్ రాథోడ్ బోడ జనార్ధన్ గుండ్రపల్లి గ్రామ అధ్యక్షులు బొల్ల శివకుమార్ ఎన్ ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షులు బోడ శ్రీకాంత్ బానోత్ శ్రీకాంత్ మాజీ సర్పంచ్ బానోత్ రవికుమార్, ఇదునూరి ప్రభాకర్ బానోత్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



# చటాన్‌పల్లి ఆర్ఓబీ పనులు వేగవంతం చేయాలి

**ఆర్ఓబీ పనుల్లో జాప్యం వద్దు.. ఎమ్మెల్యే ఆదేశం**

**శాఖల సమన్వయంతో ఆర్ఓబీ పనులు పూర్తి చేయాలి**



**తొలి అక్షరం/షాద్ నగర్,సెప్టెంబర్ 05:** చటాన్‌పల్లి వద్ద నిర్మిస్తున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులను వేగవంతం చేసి నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అధికారులను ఆదేశించారు. శనివారం షాద్‌నగర్ ఆర్డీవో కార్యాలయంలో సంబంధిత శాఖల అధికారులతో ఆర్ఓబీ నిర్మాణ పనులపై సమీక్ష నిర్వహించారు. పనుల పురోగతి, ఎదురవుతున్న సమస్యలు, అవసరమైన అనుమతులపై చర్చించారు. విద్యుత్ లైన్ల మార్పిడి, మిషన్ భగీరథ పైపులైన్లు, రహదారి అంశాలు, ట్రాఫిక్ నియంత్రణపై అధికారులకు పలు సూచనలు చేశారు. శాఖల మధ్య సమన్వయంతో పనిచేసి పనుల్లో జాప్యం లేకుండా చూడాలని అన్నారు. ఆర్ఓబీ పూర్తయితే ట్రాఫిక్ రద్దీ తగ్గడంతోపాటు ప్రజలు, వాహనదారులకు రాకపోకలు సులభతరం అవుతాయని పేర్కొన్నారు. సమావేశంలో ఆర్డీవో ఎన్.ఆర్. సరిత, ఆర్అండ్‌బీ అధికారులు, మున్సిపల్ కమిషనర్ సునీత, తహసీల్దార్ నాగయ్య, ట్రాఫిక్ సీఐ శంకరయ్య, విద్యుత్, మిషన్ భగీరథ అధికారులు పాల్గొన్నారు.

# నూతన గృహ గృహప్రవేశానికి హాజరై శుభాకాంక్షలు తెలియజేసిన చిన్నకోర్పోల్ గ్రామ సర్పంచ్ అనిత- బద్రునాయక్

**-చిన్న కోర్పుల్ సొసైటీ డైరెక్టర్ చింతల వేణుగోపాల్ గౌడ్.**





**తొలి అక్షరం/నెక్కొండ సెప్టెంబర్ 5:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలోని చిన్నకోర్పోల్ గ్రామంలో కాసాని పద్మా వీరస్వామి వీరస్వామి కూతురు శిరీష లు నూతనంగా నిర్మించిన గృహప్రవేశంలో భాగంగా గృహప్రవేశానికి హాజరైన గ్రామ సర్పంచ్ బానోత్ అనిత -బద్రునాయక్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సొసైటీ డైరెక్టర్ చింతల వేణుగోపాల్, కోయ్యడ రాజు, ఆత్మకూరి సతీష్,ఆత్మకూరి సారయ్య, చిన్న కొర్పుల్ గ్రామ కార్యదర్శి సురేష్, ఆత్మకూరి శ్రీనివాస్, తొగరు వెంకటేష్ లు హాజరై కాసాని వీరస్వామి కి శుభాకాంక్షలు తెలియజేశారు

# మల్లంపల్లి పల్లె దవాఖానలో బాలికలకు ప్రత్యేక హెచ్‌పీవీ టీకా కార్యక్రమం



**తొలి అక్షరం/మల్లంపల్లి, సెప్టెంబర్ 5:** గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణకు ముందస్తు చర్యల్లో భాగంగా మల్లంపల్లి పల్లె దవాఖాన ఆధ్వర్యంలో 1415 ఏళ్ల బాలికలకు ప్రత్యేక హెచ్‌పీవీ టీకా కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వైద్యాధికారి డాక్టర్ బి. శ్రవణ్ కుమార్, మల్లంపల్లి ఉపసర్పంచ్ అంకం సురేష్ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ బి. శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ.. హ్యూమన్ పాపిలోమా వైరస్ హెచ్ పి వివల్ల భవిష్యత్‌లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంటుందని, చిన్న వయసులోనే హెచ్‌పీవీ వ్యాక్సిన్ తీసుకోవడం ద్వారా ఈ క్యాన్సర్‌ను నివారించడంలో గణనీయమైన రక్షణ పొందవచ్చని తెలిపారు. అర్హత కలిగిన బాలికలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బాలికల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా హెచ్‌పీవీ టీకా ఎంతో కీలకమని, తల్లిదండ్రులు తమ పిల్లలకు టీకాలు ఇప్పించేందుకు ముందుకు రావాలని ఉపసర్పంచ్ అంకం సురేష్ కోరారు. వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స చేయడం కంటే, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ఉత్తమమని పేర్కొన్నారు. పల్లె దవాఖాన సిబ్బంది అర్హులైన 1415 ఏళ్ల బాలికలను గుర్తించి వారికి హెచ్‌పీవీ టీకాలను అందించారు. టీకా ప్రాముఖ్యత, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బాలికలు, తల్లిదండ్రులకు ఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ కమల, ఏఎన్ఎమ్‌లు మంజు, వసంత, హెల్త్ అసిస్టెంట్ రాజయ్య, ఆశా వర్కర్ సుజాత తదితరులు పాల్గొని టీకాల కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

# వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలన: ప్రతిపక్షం గ్యారంటీల అమలుపై ప్రశ్నార్థకం!

**రైతు భరోసా, ఉద్యోగాల భర్తీ, మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణంతో పాలన గాడిలో పడిందంటున్న రేవంత్ ప్రభుత్వం**

**ఆరు గ్యారంటీల కోతలు, బకాయిల మోతతో ప్రజలకు మిగిలింది పీడనేనంటూ చార్జ్‌షీట్‌తో బీఆర్ఎస్ దాడి**

**ర్యాలీలు, ప్రెస్ మీట్ల ఆర్భాటాల నడుమ రుణమాఫీ, పింఛన్లు, నిరుద్యోగ భృతి ఫలితాల కోసం సామాన్యుడి ఎదురుచూపు**

**నాయకుల ప్రచార హోరును పక్కనపెట్టి తమ జీవితాల్లో వచ్చిన నిజమైన మార్పుపైనే తీర్పు ఇవ్వనున్న తెలంగాణ ఓటరు**




**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ సెప్టెంబర్ 5:** హైదరాబాద్ ఆరు గ్యారంటీల హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం సచివాలయ ప్రాంగణంలో వెయ్యి రోజుల మైలురాయిని చేరుకుంది. గడిచిన కాలంలో సాధించిన అభివృద్ధి, సంక్షేమాన్ని ఊరూరా చాటిచెబుతూ అధికార పక్షం సంబరాల్లో మునిగితేలుతోంది. మరోవైపు పదేళ్ల పాలనను గుర్తుచేస్తూ గ్యారంటీల హామీలు ఏవంటూ ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ రోడ్డెక్కి చార్జ్‌షీట్లతో సమరం ప్రకటించింది. ధర్నాలు ర్యాలీలు ప్రెస్ మీట్ల హోరుతో తెలంగాణ రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. అయితే ఈ సంబరాలు సమరాల నడుమ అసలు సిసలైన సామాన్యుడి గొంతుక ఏమిటి అనేదే ఇప్పుడు అత్యంత ప్రాధాన్య అంశంగా మారింది. కాంగ్రెస్ సర్కార్ తన వెయ్యి రోజుల పాలనను ప్రజాస్వామ్య పునరుద్ధరణగా అభివర్ణిస్తోంది. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం నెలకు వేలాది రూపాయల ఆదా తెచ్చిపెట్టిందని ప్రభుత్వం చెబుతోంది. గృహ జ్యోతి ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పేద కుటుంబాల నెలవారీ ఖర్చును గణనీయంగా తగ్గించిందని పేర్కొంటోంది. ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేయడం, సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయడాన్ని తన పెద్ద సాధనగా చాటుకుంటోంది. గత పదేళ్లలో ధ్వంసమైన ఆర్థిక పాలనా వ్యవస్థలను మళ్లీ పట్టాలెక్కించడానికే ఈ వెయ్యి రోజులు సరిపోయాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపక్షానికి సవాల్ విసురుతున్నారు. ఇందుకు పూర్తి భిన్నంగా ప్రతిపక్ష బీఆర్ఎస్ కాంగ్రెస్ వైఫల్యాలనే ఆయుధంగా మలచుకుని క్షేత్రస్థాయిలో విరుచుకుపడుతోంది. ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలు దగా పడ్డాయని ప్రజలకు మిగిలింది ప్రగతి కాదు పీడన అని విమర్శిస్తోంది. రైతు భరోసా సాగునీరు సకాలంలో అందక ధాన్యానికి బోనస్ దక్కక రైతాంగం తీవ్ర నిరాశలో ఉందంటూ నిరసన గళం విప్పుతోంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాకపోవడం నిరుద్యోగ భృతి ఊసే లేకపోవడంతో విద్యార్థి లోకం అసంతృప్తితో ఉందనేది విపక్షాల ప్రధాన ఆరోపణ. పెంచిన పింఛన్లు అందక కొత్త కార్డులు రాక వృద్ధులు వికలాంగులు ఎదురుచూస్తున్నారని ప్రభుత్వంపై చార్జ్‌షీట్ దాఖలు చేసింది. ఈ రెండు వైఖరుల మధ్య ప్రజలకు కావాల్సింది ప్రచార ఆర్భాటాలు కావు. రైతుకు కావలసింది పంటకు సరైన మద్దతు ధర వేళకు అందే సాగునీరు ధైర్యాన్నిచ్చే పెట్టుబడి సాయం. యువత కోరుకునేది పారదర్శక నియామకాలు భవిష్యత్తుకు భరోసానిచ్చే ఉద్యోగాలు. మహిళలు వృద్ధులు ఆశించేది కోతలు లేని సంక్షేమం సకాలంలో చేతికి అందే పింఛన్. నిత్యావసరాల ధరలు పెరిగిన వేళ సామాన్యుడు కోరుకునేది నిసందేహంగా నిలకడైన జీవనం. వెయ్యి రోజులు అనేది ఏ రాజకీయ పార్టీకైనా ఒక మైలురాయి కావచ్చు. ప్రచారానికి ఒక వేదిక కావచ్చు. కానీ ప్రజాస్వామ్యంలో ఆఖరి తీర్పు చెప్పేది రాజకీయ నాయకులు కాదు ప్రజలే. ప్రతి ఇంట్లో వెలిగిన వెలుగు ఎంత ప్రతి బిడ్డ భవిష్యత్తుకు దక్కిన భరోసా ఎంత అన్నదే అసలైన ప్రగతికి ప్రామాణికం. ఈ వెయ్యి రోజుల సుదీర్ఘ ప్రయాణంలో ఎవరి సంబరం నిజం ఎవరి సమరం ధర్మం అనేది రాబోయే రోజుల్లో ప్రజలు తమ తీర్పు ద్వారానే స్పష్టం చేయనున్నారు.

## ఉద్యోగాల కల్పనలో ప్రభుత్వ వైఫల్యం

**యాదగిరిగుట్టలో జరిగే ఏఐవైఎఫ్ రాష్ట్ర 3వ మహాసభలను జయప్రదం చేయండి**


**బిరాష్ట్ర సహాయ కార్యదర్శి నానబాల రామకృష్ణ**




**తొలి అక్షరం/ఖమ్మం జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 5:** రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నానబాల రామకృష్ణ విమర్శించారు. నిరుద్యోగ యువతకు తక్షణమే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగాఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నానబాల రామకృష్ణ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను గుర్తించి వెంటనే నోటిఫికేషన్లు విడుదల చేసి నియామకాలు చేపట్టాలని కోరారు. ఉద్యోగాల కోసం ఏళ్ల తరబడి యువత పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారని, నోటిఫికేషన్ల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసి నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలని అన్నారు. జిల్లా కేంద్రంలో గల నల్లమల్ల గిరిప్రసాద్ భవన్ సిపిఐ ఆఫీస్ నందు రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్ల ఆవిష్కరణ చేయడం జరిగిందిసెప్టెంబర్ 8, 9, 10 తేదీల్లో యాదగిరిగుట్ట నందు నిర్వహించనున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని నానబాల రామకృష్ణ పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువత, విద్యార్థులు, ఏఐవైఎఫ్ కార్యకర్తలు, యువజనులు పెద్ద సంఖ్యలో పాల్గొని రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. నిరుద్యోగ సమస్య పరిష్కారం, ఖాళీ ఉద్యోగాల భర్తీ, యువతకు మెరుగైన ఉపాధి అవకాశాల కోసం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మామిండ్ల శ్రీనాథ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి చింతల రమేష్ , ఉపాధ్యక్షులు మామిడాల కిరణ్, సహాయ కార్యదర్శి మల్లెబోయన ఉపేందర్ ,ఆఫీస్ బేరర్స్ కృష్ణ ప్రసాద్, ఎస్.కె రఫీ, సతీష్ తదితరులు పాల్గొన్నారు

## నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో పాల్గొన్న టీపీసీసీ సభ్యులు సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి





**తొలి అక్షరం/నెక్కొండ సెప్టెంబర్ 5:** వరంగల్ జిల్లా నెక్కొండ మండలం పెద్ద కోర్పోల్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఎడ్ల రజిత. లక్ష్మణ్ పటేల్. దంపతులు నూతనంగా ఏర్పాటు చేసుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసి రిబ్బన్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన పిసిసి సభ్యులు సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి, ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి బక్కి అశోక్ మండల మండల్ అధ్యక్షులు లావుడియా తిరుమల్ సోసైటీ చైర్మన్స్ ఆవుల శ్రీనివాస్ మాదాటి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు ఈదునూరి సాయికృష్ణ మార్కెట్ డైరెక్టర్ రావుల మహిపాల్ రెడ్డి వరంగల్ జిల్లా ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షులు బోడ శ్రీకాంత్ నాయక్ బంజరపల్లి సర్పంచ్ రమేష్ రాథోడ్ సొసైటీ డైరెక్టర్ మట్టే వెంకటయ్య కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు భీమన్న కాంగ్రెస్ పార్టీ గ్రామ ఉపాధ్యక్షులు గాజుల రాము కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మెండె రవీందర్ పడాల రవి కుమార్ మాజీ సర్పంచ్ మేండే పద్మ కుమారస్వామి, పడాల రాజకుమార్ గై సాంబయ్య గై వెంకన్న కాగు వెంకన్న గంట సజన్ కన్న శంకర్ పడాల వేణు కాంగ్రెస్ పార్టీ సొసైటీ డైరెక్టర్ మట్టే వెంకటయ్య వార్డ్ సభ్యులు పోరండ్ల రామచందర్ దాసరి యాకయ్య, బండారి జంపయ్య పడాల శ్రీను అంబాల శీను కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు కొమరారెడ్డి దయ్యాల ప్రభాకర్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి బిర్రు మదర్ కాంగ్రెస్ పార్టీ బిఎల్ఎ చెరుకు ఏకాంత్ బిర్రు కమల్ హాసన్, వరంగల్ జిల్లా ఎస్సీ సెల్ కార్యవర్గ సభ్యులు పాలకుంట శీను తదితరులు పాల్గొన్నారు.

## సర్వేపల్లి ఆశయ సాధనే ధ్యేయం కావాలి




**- సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం**

**- గీతాంజలి హైస్కూల్ కరస్పాండెంట్ కృష్ణ**

**- గీతాంజలి హైస్కూల్లో మిన్నంటిన ఉపాధ్యాయ దినోత్సవ సంబరాలు**




**తొలి అక్షరం/జవహర్‌నగర్, సెప్టెంబర్5:** విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే మహోన్నత శక్తి ఒక్క ఉపాధ్యాయుడికే ఉంది. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చూపిన బాటలోనే సాగుతూ..ఆయన ఆశయ సాధనే ధ్యేయంగా ప్రతి ఉపాధ్యాయుడూ ముందడుగు వేయాలి అని గీతాంజలి హైస్కూల్ కరస్పాండెంట్ కృష్ణ పిలుపునిచ్చారు. బాలాజీ నగర్‌లోని గీతాంజలి హైస్కూల్లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కరస్పాండెంట్ కృష్ణ ప్రసంగిస్తూ ఉపాధ్యాయ లోకానికి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...భారతదేశ తొలి ఉపరాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం మనందరికీ గర్వకారణమని పేర్కొన్నారు. కేవలం పాఠాలు చెప్పడమే కాకుండా విద్యార్థుల్లో నైతిక విలువలను పెంపొందింపజేసి సమాజానికి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన గురుతర బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. మారుతున్న సమాజానికి అనుగుణంగా ఉపాధ్యాయులు తమ బోధనా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, ప్రతి విద్యార్థిలో దాగున్న ప్రతిభను వెలికితీయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణి, వైస్ ప్రిన్సిపాల్ కర్నే సురేందర్, నాగరాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.




## జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన ఉపాధ్యాయులకు ఘన సన్మానం



**తొలి అక్షరం/నెక్కొండ సెప్టెంబర్ 5:** వరంగల్ జిల్లానెక్కొండ మండలం నుండి ఉపాధ్యాయ వృత్తిలో విశిష్ట సేవలు అందించిన ఉపాధ్యాయులను గుర్తించి వారి సేవలను కొనియాడుచు, ఈ విద్యా సంవత్సరంలో ఐదుగురు ఉపాధ్యాయులు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందడం జరిగినది. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన వారిలో 1,బత్తుల పరమేశ్వర్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు జెడ్పి ఉన్నత పాఠశాల సూరిపల్లి,2, స్కూల్ అసిస్టెంట్ విభాగంలో బాధావత్ హరిత సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు జెడ్పి ఉన్నత పాఠశాల రెడ్లవాడ, అదేవిధంగా 3,సెకండరీ గ్రేడ్ టీచర్స్ విభాగంలో బండి భారతి ప్రాథమిక పాఠశాల నెక్కొండ, 4,పెంతల ప్రతాప్ యుపిఎస్ అమీన్ పేట,5, తెలంగాణ మోడల్ స్కూల్ నుండి శ్రీనివాసరావు పిజిటి తెలుగు అవార్డు పొందిన వారిలో ఉన్నారు. వీరి సేవలను కొనియాడుచు వరంగల్ ప్రాంతంలోని ఉరుసు గుట్ట సమీపంలో ఉన్న ఆకుతోట కన్వెన్షన్ హాలు నందు జిల్లా కలెక్టర్ సత్య శారద చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుతో పాటు ప్రశంసా పత్రం అదేవిధంగా శాలువాలతో ఘనంగా సన్మానించబడినారు. ఈ సందర్భంగా పిఆర్టియు టిఎస్ నెక్కొండ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మాలోత్ ప్రతాప్ సింగ్, మెట్టుపల్లి ఐలయ్య, అదే విధంగా పి ఆర్ టి యు మండల అసోసియేట్ అధ్యక్షులు వీరన్న వసంత్ కుమార్ ఉపాధ్యక్షులు రామకృష్ణ సంతోష్ మరియు కార్యదర్శులు గురు ప్రసాద్ రాజేందర్ మహిళా అసోసియేట్ అధ్యక్షులు శ్రీదేవి మహిళా ఉపాధ్యక్షులు మాధవి అరుణ మహిళా కార్యదర్శి హరిత రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గురజాల శ్రీధర్ రెడ్డి వడ్డే శ్రీనాథ్ కర్ర యాకూబ్ రెడ్డి జిల్లాకార్యవర్గ సభ్యులు బానోత్ బిక్షపతి మరియు అంకం ప్రవీణ్ గుగులోత్ శేఖర్ మరియు మండలఉపాధ్యాయులు వీరి సేవలను కొనియాడుచు శుభాకాంక్షలు తెలియజేశారు.

# చనిపోయిన వారికి రేషన్ కార్డులా?

- నెల్లికుదురులో ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన వ్యవహారం
- డెత్ సర్టిఫికెట్ ఇచ్చిన తర్వాత కూడా రికార్డుల్లో పేర్లు ఎలా?
- అధికారులు.. ప్రజాప్రతినిధులు ఏం చేస్తున్నారు?




**తొలి అక్షరం/నెల్లికుదురు సెప్టెంబర్ 5:** నెల్లికుదురు: ప్రభుత్వ రికార్డుల్లో చనిపోయిన వ్యక్తుల పేర్లు కొనసాగుతూ, వారి పేర్లతో రేషన్‌కార్డులు జారీ అవుతున్నాయన్న ఆరోపణలు నెల్లికుదురు మండలంలో కలకలం రేపుతున్నాయి. 2003లో బొల్లం వెంకటయ్య మృతి చెందగా, అప్పట్లోనే అధికారుల నుంచి డెత్ సర్టిఫికెట్ జారీ అయిందని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. అనంతరం ఆయనకు సంబంధించిన పింఛన్, రేషన్ బియ్యం తదితర ప్రభుత్వ లావాదేవీలు నిలిచిపోయాయని పేర్కొంటున్నారు. అయితే అదే వ్యక్తి పేరు రేషన్‌కార్డు వ్యవస్థలో ఎలా కొనసాగుతోంది? మరణించిన వ్యక్తి వివరాలు ప్రభుత్వ రికార్డుల్లో ఇప్పటికీ ఎందుకు కనిపిస్తున్నాయి? డెత్ సర్టిఫికెట్ జారీ చేసిన వ్యవస్థకు, రేషన్‌కార్డు వ్యవస్థకు మధ్య సమన్వయం లేదా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మరణించిన సభ్యుడి పేరును రేషన్‌కార్డు నుంచి తొలగించేందుకు ప్రభుత్వమే ప్రత్యేక సేవను అందుబాటులో ఉంచింది. అలాంటప్పుడు ఏళ్ల క్రితమే మరణించిన వ్యక్తుల పేర్లు రికార్డుల్లో కొనసాగుతుంటే సంబంధిత అధికారులు ఏం చేస్తున్నారన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఇది ఒక్క కుటుంబానికి సంబంధించిన సమస్యగా కాకుండా, మండలంలోని రేషన్‌కార్డులపై సమగ్ర పరిశీలన అవసరమనే అంశాన్ని ముందుకు తెస్తోంది. మరణించిన వారి పేర్లపై రేషన్, పింఛన్, ఇతర ప్రభుత్వ ప్రయోజనాలకు సంబంధించిన లావాదేవీలు జరుగుతున్నాయా? ఎక్కడైనా రికార్డుల లోపాలు ఉన్నాయా? అన్నదానిపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది. పజల పన్నులతో నడిచే సంక్షేమ పథకాల విషయంలో రికార్డుల నిర్వహణ ఇంత నిర్లక్ష్యంగా ఉంటే బాధ్యత ఎవరిది? నెల్లికుదురు మండలంలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా రేషన్‌కార్డుల డేటాను మరణ ధ్రువపత్రాల రికార్డులతో సమన్వయం చేసి చనిపోయిన వారి పేర్లను తక్షణమే తొలగించి, అక్రమాలకు తావులేకుండా సమగ్ర తనిఖీ నిర్వహించాలని ప్రజలు కోరుచున్నారు.

# విధి నిర్వహణతో పాటు వ్యక్తిగత భద్రతా ముఖ్యం: మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్

**తొర్రూర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎస్పీ**

**గంజాయి, గుడుంబాపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశం**

**వినాయక చవితి భద్రతా ఏర్పాట్లపై సమీక్ష**








**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) సెప్టెంబర్ 5:** ప్రజల భద్రత ఎంత ముఖ్యమో, విధి నిర్వహణలో ఉండే పోలీస్ సిబ్బంది వ్యక్తిగత భద్రత కూడా అంతే ముఖ్యమని మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా.శబరీష్, ఐపీఎస్ స్పష్టం చేశారు. శనివారం ఆయన తొర్రూర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి, పలు విభాగాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. లాకప్, రైటర్స్ రూమ్, పరిసరాల పరిశుభ్రతతో పాటు రికార్డుల నిర్వహణ, సిబ్బంది విధుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్ఐ, అధికారులతో ఎస్పీ సమీక్ష నిర్వహించారు. సి సి టి ఎన్ ఎస్ ఆన్‌లైన్ ప్రక్రియలు, డిజిటల్ అవర్ వినియోగం, సీసీ కెమెరాల పర్యవేక్షణ, రాత్రి వేళల్లో పెట్రోలింగ్, గ్రామాల సందర్శనలపై చర్చించారు. స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్ల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని ఆదేశించారు. **అక్రమ రవాణాపై ఉక్కుపాదం** గంజాయి అక్రమ రవాణా, వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించి కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు. గుడుంబా తయారీ, విక్రయాలు మరియు అక్రమ మద్యంపై నిరంతరం తనిఖీలు చేపట్టాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు క్రమం తప్పకుండా నిర్వహించాలని, ప్రమాదకర ప్రాంతాల్లో రాత్రి పెట్రోలింగ్ పటిష్టం చేయాలని స్పష్టం చేశారు. **వినాయక చవితికి పటిష్ట భద్రత** రాబోయే వినాయక చవితి పండుగ నేపథ్యంలో గణేష్ విగ్రహాల ఏర్పాటు, అనుమతులు, నిర్వాహకులతో సమన్వయం మరియు భద్రతా చర్యలపై వివరాలు సేకరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. **సిబ్బంది భద్రత తప్పనిసరి** బందోబస్తు విధులకు వెళ్లే సిబ్బంది తప్పనిసరిగా రక్షణ పరికరాలు, లాఠీలు ధరించాలని ఎస్పీ ఆదేశించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వాడుకుంటూ, అంకితభావంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. తొర్రూర్ డిఎస్పీ కృష్ణ కిషోర్, సీఐ గణేష్ ఎస్సై మహేందర్ రెడ్డి మరియు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# వయోధికులకు ఆత్మీయ నేస్తం... చిన్నారులకు సురక్షిత తీరం 'సహాయ ఫౌండేషన్'

- హైదరాబాద్‌లో ఎన్నో ఏళ్లుగా మానవత్వంతో విశేష సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సంస్థ
- వృద్ధుల సంరక్షణ, చైల్డ్ కేర్, హోమ్ హెల్త్‌కేర్ కోసం డాక్టర్ రఘు, డాక్టర్ నీలు పిలుపు



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ సెప్టెంబర్ 5:** హైదరాబాద్: మహానగరంలో ఎన్నో ఏళ్లుగా నమ్మకం ఆప్యాయతతో కూడిన సేవలు అందిస్తూ 'సహాయ ఫౌండేషన్' అనేక కుటుంబాలకు కొండంత అండగా నిలుస్తోంది. మారుతున్న జీవన శైలి ఉద్యోగ బాధ్యతల కారణంగా ఇంట్లో ఉండే వయోధికులను చిన్న పిల్లలను పర్యవేక్షించుకోవడం సవాలుగా మారిన తరుణంలో సహాయ ఫౌండేషన్ మానవత్వంతో ముందుకు వచ్చి బాధ్యతాయుతమైన సేవలు అందిస్తోంది. ఈ సందర్భంగా సహాయ ఫౌండేషన్ నిర్వాహకులు డాక్టర్ రఘు, డాక్టర్ నీలు మాట్లాడుతూ సమాజంలో వృద్ధులకు ప్రేమానురాగాలు పిల్లలకు సురక్షితమైన వాతావరణం అందించడమే తమ ముఖ్య ఉద్దేశమని వెల్లడించారు. అనుభవజ్ఞులైన కేర్‌టేకర్ల ద్వారా వృద్ధులకు ఆత్మీయమైన తోడు సమయానికి మందులు అందించడంతో పాటు పిల్లల సంరక్షణ ఆరోగ్య రక్షణ ఫిజియోథెరపీ మరియు హోమ్ హెల్త్‌కేర్ లాంటి విస్తృత సేవలను అందుబాటులోకి తెచ్చినట్లు వారు స్పష్టం చేశారు. ఇంట్లో వృద్ధుల లేదా పిల్లల సంరక్షణ కోసం నమ్మకమైన సహాయం కావలసిన కుటుంబాలు హైదరాబాద్ మియాపూర్ లోని సహాయ ఫౌండేషన్ కార్యాలయాన్ని గానీ లేదా 9966019930 ఫోన్ నంబర్‌లో గానీ సంప్రదించి ఈ విశేష సేవా సౌకర్యాలను వినియోగించుకోవాలని సంస్థ నిర్వాహకులు కోరారు.

# గురువులకు పాదాభివందనం చేసిన ఎమ్మెల్యే శంకర్

**విద్యార్థుల భవిష్యత్తుకు గురువులే మార్గదర్శకులు: ఎమ్మెల్యే శంకర్**

**గురువులకు పాదాభివందనం చేసిన ఎమ్మెల్యే శంకర్**

**జ్ఞానమనే విత్తనాన్ని నాటి.. మేధస్సు మొక్కలను పెంచండి: శంకర్**









**తొలి అక్షరం/షాద్ నగర్, సెప్టెంబర్05:** ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. తనకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు మదన్ మోహన్ రెడ్డి, గోపాలచార్యులను ప్రత్యేకంగా సన్మానించి పాదాభివందనం చేశారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులకు మేమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు తమలోని విజ్ఞానాన్ని విద్యార్థుల భవిష్యత్తు కోసం వినియోగించాలని సూచించారు. జ్ఞానమనే విత్తనాన్ని నాటి, మేధస్సు అనే మొక్కలను పెంచాలని పిలుపునిచ్చారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించి, వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని కోరారు. గురువులను గౌరవించడం ప్రతి విద్యార్థి బాధ్యత అని అన్నారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం ఒక్కొక్కటిగా పరిష్కరిస్తోందని తెలిపారు. భవిష్యత్తులో ఉపాధ్యాయులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని హామీ ఇచ్చారు. ఉపాధ్యాయులు తమ సమస్యలను ప్రభుత్వం చూసుకుంటుందని భావించి విద్యార్థుల చదువులు, భవిష్యత్తుపై మరింత దృష్టి పెట్టాలని కోరారు. ఉపాధ్యాయులను సత్కరించే అవకాశం తనకు లభించడం సువర్ణ అవకాశంగా భావిస్తున్నానని శంకర్ పేర్కొన్నా రు. వచ్చే ఏడాది ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను మరింత ఘనంగా నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బస్వం, మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, ఎంఈఓ మనోహర్, మార్కెట్ డైరెక్టర్ కరుణాకర్, ఉపాధ్యాయులు గంగిరెడ్డి, జనార్ధన్ పాల్గొన్నారు.

# కృష్ణవేణి పాఠశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

- ఉపాధ్యాయుల సేవలు మరువలేనివి: ప్రిన్సిపాల్ రఫత్ సుల్తానా
- కృష్ణవేణి పాఠశాలలో ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు




**తొలి అక్షరం/షాద్ నగర్,సెప్టెంబర్ 05:** షాద్‌నగర్ పట్టణంలోని భాగ్యనగర్ కాలనీలో గల కృష్ణవేణి ఉన్నత పాఠశాలలో శనివారం జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. భారత మాజీ రాష్ట్రపతి, తత్వవేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ రఫత్ సుల్తానా ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థుల జీవిత ప్రయాణంలో వెలుగులు నింపే మార్గదర్శకులని అన్నారు. విద్యార్థుల్లో జ్ఞానం, ఆసక్తి, సృజనాత్మకత, ఆశయాలను పెంపొందించడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. సమాజ అభివృద్ధికి అవసరమైన మంచి పౌరులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల సేవలు మరువలేనివని తెలిపారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# క్రాంతి హైస్కూల్ చంద్రుగొండలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

**నవసమాజ నిర్మాతలు ఉపాధ్యాయులే.**

**- క్రాంతి హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు శ్రీరాముల నాగేశ్వర్.**







**తొలి అక్షరం/నెక్కొండ సెప్టెంబర్ 5:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల పరిధిలోని క్రాంతి హై స్కూల్ చంద్రుగొండ లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది . ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీరాముల నాగేశ్వర్ మాట్లాడుతూ ఉపాధ్యాయ దినోత్సవాన్ని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ భారత ఉప రాష్ట్రపతి మరియు తత్వవేత్త పుట్టినరోజు సందర్భంగా ఉపాధ్యాయుని ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించడం జరుగుతుందని తెలియజేశారు. అదేవిధంగా ఉపాధ్యాయులకు నవ సమాజాన్ని నిర్మించే గురుతర బాధ్యత గురువులదే అని కొనియాడారు, తల్లిదండ్రులు కేవలం విద్యార్థులకు జన్మనిస్తే వారి యొక్క దిశ నిర్దేశాన్ని కొనసాగించేది కేవలం ఒకఉపాధ్యాయునికే మాత్రమే ఆ బాధ్యత ఉంది అని కొనిఅడగడం జరిగింది. ఉపాధ్యాయుడు ఎలాంటి స్వార్థం లేనటువంటి ఉద్యోగాన్ని కొనసాగించడం జరుగుతుందని, మిగతా ఉద్యోగాలలో లంచగొండితనం అవినీతి ఇలాంటివి ఉంటాయని, ఒకఉపాధ్యాయ వృత్తిలో మాత్రమే సమాజాన్ని విద్యార్థులను, సన్మార్గంలో నడిపించేటువంటి ఏకైక సమాజ స్పృహ, బాధ్యత ఉపాధ్యాయులదే అని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని, ఉపాధ్యాయుల ను విద్యార్థిని, విద్యార్థులచే శాలువాతోపాటు చిరు సత్కారాన్ని అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం మరియు ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# నాని సినీ ప్రయాణానికి 18 ఏళ్లు..

## ఫ్యాన్స్‌కు నేచురల్ స్టార్ స్వీట్ మెసేజ్




హీరో నాని సినీ ప్రయాణం 18 ఏళ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా అభిమానులు, ప్రేక్షకులకు అతడు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపాడు. వారి ప్రేమను ఎప్పుడూ తేలిగ్గా తీసుకోలేదని చెప్పారు. ఇకపై కూడా అలా చేయబోనని స్పష్టం చేశాడు.

"18 ఏళ్లు.. అధికారికంగా సినిమాల్లో పెద్దవాడినయ్యా" అంటూ నాని 'ఎక్స్'లో పోస్టు చేశాడు. "మీ ప్రేమను ఎప్పుడూ తేలిగ్గా తీసుకోలేదు.. ఇకపై కూడా తీసుకోబోను" అని రాసుకొచ్చాడు.


నాని హీరోగా పరిచయమైన తొలి చిత్రం 'అష్టా చమ్మా'. మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా 2008 సెప్టెంబర్ 5న విడుదలైంది. అప్పటి నుంచి నటుడిగా మొదలైన నాని ప్రస్థానం హీరోగా, నిర్మాతగా ఎదిగే స్థాయికి చేరింది.

ప్రస్తుతం నాని శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ది ప్యారడైజ్'లో నటిస్తున్నాడు. ఎస్ఎల్‌వీ సినిమాస్ నిర్మిస్తున్న ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్ సెప్టెంబర్ 24న ప్రేక్షకుల ముందుకు రానుంది. తొలుత మార్చి 26న విడుదల చేయాలని నిర్ణయించారు. ఆ తర్వాత ఆగస్టు 21కి మార్చారు. చివరగా సెప్టెంబర్ 24కు వాయిదా వేశారు.


ఇటీవల విడుదలైన టీజర్ సినిమాపై అంచనాలను పెంచింది. రక్తంతో తడిసిన లుక్‌లో నాని కనిపించడం అభిమానుల్లో ఆసక్తి పెంచింది. రెండు జడలతో కనిపిస్తూ.. చేతిలో బ్లేడ్‌లతో చేసిన గొలుసుతో నాని కనిపించే సన్నివేశాలు టీజర్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అణచివేతకు గురైన ప్రజలు తిరుగుబాటు చేయడం చుట్టూ కథ సాగుతుందనే సంకేతాలు టీజర్ ఇచ్చింది. ఇందులో మోహన్‌బాబు ప్రతినాయకుడిగా కనిపించనున్నాడు. "ఈ దేశం ఎవరిది? మనది" అనే డైలాగ్‌లు టీజర్‌లో వినిపించాయి.

'ది ప్యారడైజ్' హిందీ, తెలుగు, తమిళం, ఇంగ్లిష్, స్పానిష్, బెంగాలీ, కన్నడ, మలయాళం భాషల్లో విడుదల కానుంది.

# ఆకట్టుకుంటున్న 'ఎపిక్' ట్రైలర్



బ్లాక్‌బస్టర్ హిట్ 'బేబీ' తర్వాత ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా నటిస్తున్న కొత్త చిత్రం 'ఎపిక్ - ఫస్ట్ సెమిస్టర్'. యూత్‌ఫుల్ రొమాంటిక్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను చిత్రబృందం శుక్రవారం విడుదల చేసింది. '90s' వెబ్ సిరీస్‌తో అందరి దృష్టిని ఆకర్షించిన ఆదిత్య హాసన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండటంతో సినిమాపై మంచి అంచనాలు నెలకొన్నాయి.ట్రైలర్‌ను బట్టి చూస్తే, ఈ సినిమా లండన్ కాలేజీ నేపథ్యంలో సాగే ఓ అందమైన ప్రేమకథ అని స్పష్టమవుతోంది. ప్రేమ, స్నేహం, భావోద్వేగాలు, జీవితంలోని మలుపులతో కథనం సాగనుంది. "ఒక ప్రేమకథ.. ఎన్నో భావోద్వేగాలు.. పూర్తికాని ఓ అధ్యాయం" అనే కాన్సెప్ట్‌తో ఈ సినిమాను తీర్చిదిద్దినట్టు ట్రైలర్ ద్వారా తెలుస్తోంది. ఆనంద్, వైష్ణవి మధ్య కెమిస్ట్రీ మరోసారి ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంది. వారిద్దరి మధ్య వచ్చే సన్నివేశాలు సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి.ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై నాగవంశీ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. హేషమ్ అబ్దుల్ వాహబ్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన పాటలకు శ్రోతల నుంచి అద్భుతమైన స్పందన లభించింది. తాజాగా విడుదలైన ట్రైలర్‌తో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 11న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.




# పాపరాజీపై సల్మాన్ ఆగ్రహం

బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్ మరోసారి పాపరాజీపై తన అసహనాన్ని ప్రదర్శించాడు. ప్రముఖ రియాలిటీ షో 'బిగ్ బాస్ 20' సెట్స్‌లో ఓ ఫొటోగ్రాఫర్‌పై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశాడు. 'ఇది నీ పని కాదు' అంటూ ఫొటోగ్రాఫర్‌కు చురకలంటించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.సెప్టెంబర్ 6న ప్రారంభం కానున్న బిగ్ బాస్ 20 షో ప్రీమియర్ ఎపిసోడ్ షూటింగ్ శుక్రవారం సాయంత్రం జరిగింది. ఈ సందర్భంగా కౌబాయ్ తరహా దుస్తుల్లో స్టేజ్‌పైకి వచ్చిన సల్మాన్‌ను ఫొటోలు తీసేందుకు పాపరాజీలు పోటీ పడ్డారు. ఈ క్రమంలో కొందరు ఫొటోగ్రాఫర్లు ఆయన్ను 'బాబా' అని పిలుస్తూ ఫొటోలకు పోజులివ్వమని కోరారు.

దీంతో సల్మాన్ ఒక్కసారిగా అసహనానికి గురయ్యారు. "బాబా? యహ్ తేరా కామ్ నహీ హై. ముఝే కెమెరా కే ఆగే ఆనే కీ కోయీ జరూరత్ నహీ హై" (బాబా? ఇది నీ పని కాదు. నేను కెమెరా ముందుకు రావాల్సిన అవసరం లేదు) అంటూ తీవ్రంగా స్పందించాడు. వారు పదేపదే "ఫొటోస్.. ఫొటోస్.." అని అడగడంతో మరింత విసుక్కున్నాడు.

సల్మాన్‌కు, పాపరాజీలకు మధ్య పలుమార్లు ఇలాంటి ఘటనలు జరిగాయి. అయితే, ఈ వాగ్వివాదం తర్వాత సల్మాన్ కొందరు ఫొటోగ్రాఫర్లతో కలిసి ఫొటోలకు పోజులిచ్చినట్లు కూడా తెలుస్తోంది. మరోవైపు, ఆయన తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో బిగ్ బాస్ 20 సెట్ నుంచి కొన్ని ఫొటోలను పంచుకున్నాడు.



# జోరు పెంచిన ఖుషీ కపూర్..

## జెన్ జీ కి బెస్ట్ చాయిస్!

దివంగత నటీమణి, అందాలతార శ్రీదేవి చిన్న కూతురుగా సినీ ఇండస్ట్రీలోకి అడుగు పెట్టింది ఖుషీ కపూర్. ఈమె తన సోదరీ జాన్వీ కపూర్ రేంజ్ లో పాపులారిటీ సంపాదించుకోలేదు. కానీ ఈ మధ్యకాలంలో జెన్ జీ యువతను టార్గెట్ చేసుకొని చేస్తున్న పనులు , ఇస్తున్న ఫోజులు అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. అంతేకాదు ఈమెకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపును తెచ్చిపెడుతున్నాయి అనడంలో సందేహం లేదు. ప్రస్తుతం శ్రీదేవి గతంలో నటించిన మామ్ చిత్ర సీక్వెల్ మామ్ 2 లో తన దివంగత తల్లి శ్రీదేవి పాత్రలో నటిస్తున్న విషయం తెలిసిందే .ముఖ్యంగా కరిష్మా తన్నాతో కలిసి ఖుషీ కపూర్ ఈ సినిమాలో నటిస్తోంది. ఒకవైపు ఆ సినిమా షూటింగ్లో బిజీగా ఉంటూనే..మరొకవైపు అద్భుతమైన ఫ్యాషన్ స్టోరీ తో ఆడియన్స్ ను ఆకట్టుకుంది. గ్రాజియా ఇండియా కవర్ పేజీపై భిన్నమైన ఆకృతులతో ఫోజులిచ్చి అభిమానులను మెస్మరైజ్ చేసింది . పైగా తన ట్రెండీ ఔట్ఫిట్ తో ఫ్యాషన్ ప్రియులను ఆకట్టుకుంది. ఫోటోషూట్ లో భాగంగా నాలుగు విభిన్నమైన లుక్స్ తో ఆడియన్స్ ముందుకు వచ్చిన ఈమె అందులో ఒకటి ఆలివ్ కలర్ సీక్విన్డ్ కార్డిగాన్ టాప్ ధరించి, దీనికి కాంబినేషన్లో వాల్యూమినస్ డెనిమ్ లాంగ్ స్కర్ట్ ధరించి అవుట్ ఫిట్ తో ఆకట్టుకుంది. మరో లుక్ లో ఓవర్ సైజ్డ్ డెనిమ్ జాకెట్ ధరింది.. దీనికి కింద బ్లూ షర్ట్ పై వైట్ కలర్ చెక్స్ కలిగిన షర్టు ధరించింది. పైన బటన్స్ ఓపెన్ చేసి రెండు చేతులతో షర్టు పట్టుకున్న ఈమె.. దీనికి కాంబినేషన్లో డెనిమ్ ప్యాంట్ ధరించింది. తన మేకోవర్ ను ఫుల్ ఫీల్ చేసుకోవడానికి కలర్ఫుల్ డిజైన్ కలిగిన నెక్లెస్ ధరించింది.

# తెలుగు సినిమా చరిత్రలోనే అత్యంత పొడవైన టైటిల్

## ఈ పాట కోరినవారు నెమలిపాలెం నుండి రమ, జ్యోత్స్న, నందు, మురళి, కబీర్, ఢోల్ రవి మొదలగువారు'...

'ఆ నలుగురు', 'అందరి బంధువయా' వంటి హృద్యమైన చిత్రాలతో తెలుగు ప్రేక్షకుల్లో తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న విలక్షణ దర్శకుడు చంద్ర సిద్ధార్థ్, మరో విభిన్నమైన కథాంశంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఆయన స్వీయ దర్శకత్వంలో, ఫిల్మోత్సవ్ బ్యానర్‌పై నిర్మించిన తాజా చిత్రం.. "ఈ పాట కోరినవారు నెమలిపాలెం నుండి రమ, జ్యోత్స్న, నందు, మురళి, కబీర్, ఢోల్ రవి మొదలగువారు". భారతీయ సినీ చరిత్రలోనే అత్యంత పొడవైన టైటిల్‌గా నిలుస్తున్న ఈ సినిమా సెప్టెంబర్ 18న విడుదల కానుంది.ఈ చిత్రం ఒక హై-కాన్సెప్ట్ సైకలాజికల్ మిస్టరీ మ్యూజికల్ మూవీగా రూపుదిద్దుకుంది. దివంగత ప్రముఖ రచయిత, దర్శకుడు మదన్ అందించిన కథతో ఈ సినిమాను చంద్ర సిద్ధార్థ్ తెరకెక్కించారు. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'ఆ నలుగురు' క్లాసిక్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. సౌండ్ థెరపీ, బ్రెయిన్ మ్యాపింగ్, జ్ఞాపకాలు, అపరాధ భావన వంటి అంశాలను కథలో కీలక మలుపులుగా చూపిస్తూ, సంగీతం-మానవ మెదడు మధ్య ఉన్న సంబంధాన్ని ఆవిష్కరించే ప్రయత్నం చేశారు.

ఈ సందర్భంగా దర్శకుడు చంద్ర సిద్ధార్థ్ మాట్లాడుతూ, "ఈ కథ నా స్నేహితుడైన మదన్‌తో కలిసి చేయాలనుకున్న ప్రాజెక్ట్. ఇది ఆయన చివరిగా ప్లాన్ చేసిన సినిమా. ప్రతిరోజూ రాత్రి 10:30 గంటలకు ఒక రేడియో స్టేషన్ నుంచి ఒకే పాట ప్రసారమవుతుంది. ఆ




పాటను నెమలిపాలెం నుంచి కొందరు వ్యక్తులు కోరుతుంటారు. అదే ఈ సినిమా టైటిల్ వెనుక ఉన్న రహస్యం. ధ్వని, న్యూరోసైన్స్, ప్రేమ వంటి అంశాలతో ముడిపడిన ఈ సైకలాజికల్ థ్రిల్లర్ ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తుంది. ఇది ఒక ప్రయోగాత్మక ప్రయత్నం" అని వివరించారు.

ఈ చిత్రంలో హర్ష హీరోగా పరిచయం అవుతుండగా, అమైరా గోస్వామి, సుజనా రెడ్డి, ఇనాయా సుల్తానా, రవివర్మ, అశోక్‌వర్ధన్, రేఖా నిరోషా కీలక పాత్రలు పోషించారు. జే రెక్స్ సంగీతం అందించిన ఈ చిత్రంలో నాలుగు పాటలు ఉన్నాయి. మానవ సంబంధాలను సున్నితంగా ఆవిష్కరించే చంద్ర సిద్ధార్థ్, ఈసారి ఒక ఆధునిక థ్రిల్లర్‌తో ఎలాంటి మ్యాజిక్ చేస్తారోనని సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.